జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php
సంపుటి 16 సంచిక 68 విశాఖపట్నం సోమవారం 30 అక్టోబరు 2023 8 పేజీలు వెల : 5.00




# పట్టాలపై మరో ఘోరం



**10 మంది దుర్మరణం**

**పలాస ప్యాసింజర్‌ను ఢీకొట్టిన రాయగడ రైలు**

**60 మందికిపైగా గాయాలు**

**కేబుల్ సమస్యతో ఆగిపోయిన ప్యాసింజర్**

**అదే లైన్‌లో వెనుక నుంచి ఢీకొట్టిన మరో రైలు**

**ఇంజన్, గార్డు బోగీ, మరో రెండు బోగీలు నుజ్జు**

**మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం**

**రెండు రైళ్లూ విశాఖ నుంచి బయలుదేరినవే**

**విజయనగరం జిల్లాలో ప్రమాదం**

**స్తంభించిన రైళ్ల రాకపోకలు**

**విశాఖ మార్గంలో పలుచోట్ల నిలిపివేత**

జామి/లక్కవరపుకోట/ఎస.కోట, అక్టోబరు 29: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఘోరాన్ని మరచిపోకముందే... మరో రైలు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ప్యాసింజర్‌ను... అదే పట్టాలపై వచ్చిన మరో ప్యాసింజర్ రైలు వెనుక నుంచి ఢీకొట్టింది. విజయనగరం జిల్లా అలమండ- కంటకాపల్లి స్టేషన్ల మధ్య జరిగిన ఈ దుర్ఘటనలో 10 మంది దుర్మరణం పాలయ్యారు. 60 మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారు. తొలుత ఆరుతో మొదలైన మృతుల సంఖ్య... సమయం గడిచేకొద్దీ పెరుగుతూ పోయింది. సంఘటన స్థలం వద్ద నెలకొన్న పరిస్థితులు, క్షతగాత్రుల సంఖ్యను చూస్తే... మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. రైల్వే అధికారులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలివి...

పలాస ప్యాసింజర్ రైలు ఆదివారం సాయంత్రం 5.45 గంటలకు విశాఖలో బయలు దేరింది. విజయనగరం జిల్లా కొత్తవలస దాటిన

(మిగతా 2లో..)

## రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం జగన్

ఈ ప్రమాదంపై ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలకు సీఎం జగన్ 10 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి 2 లక్షల చొప్పున ప్రకటించారు.

## ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



రైలు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై మోడీ రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మాట్లాడారు. సహాయక చర్యలు చేపట్టాలని ప్రధాని ఆదేశించారు. ప్రమాదంపై సీఎం జగన్‌తో మంత్రి అశ్విన్ వైష్ణవ్ మాట్లాడారు.

# చంద్రబాబు అంటే ఓ బ్రాండ్

**విజనరీ లీడర్‌గా ప్రపంచవ్యాప్త గుర్తింపు**

**ఆయన చేసిన అభివృద్ధిని తెలుగుజాతి మరవదు**

**'సీబీఎన్స్ గ్రాటిట్యూడ్' కాన్సర్ట్‌కు భారీగా వచ్చిన అభిమానులు, కార్యకర్తల భావోద్వేగ వ్యాఖ్యలు**

**సీబీఎన్ నినాదాలతో నాలుగు గంటలపాటు మార్మోగిన గచ్చిబౌలి స్టేడియం పరిసరాలు**



హైదరాబాద్ సిటీ/ గచ్చిబౌలి/ రాయదుర్గం, అక్టోబరు 29: చంద్రబాబు నాయుడు అంటే ఒక బ్రాండ్ అని.. తెలుగుజాతి ఉన్నంత వరకూ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన అభివృద్ధిని ప్రపంచంలోని తెలుగువారు మరిచిపోలేరని సీబీఎన్ అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. ఐఎసబీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివాటికి పునాదులు వేసిన చంద్రబాబును దార్శనికుడైన నాయకుడిగా ప్రపంచం ఎప్పుడో గుర్తించిందని పేర్కొన్నారు. హైటెక్ సిటీ అనగానే తెలుగువారందరికీ గుర్తొచ్చే 'సైబర్‌టవర్స్' నిర్మాణం జరిగి 25 ఏళ్లవుతున్న (రజతోత్సవం) సందర్భంగా ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో 'తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'సీబీఎన్స్ గ్రాటిట్యూడ్ కాన్సర్ట్'కు అన్ని వర్గాల నుంచీ అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు.. సీబీఎన్ అభిమానులు, ఐటీ ఉద్యోగులు, గ్రేటర్‌లోని పలుప్రాంతాల నుంచి యువత భారీ సంఖ్యలో తరలిరావడంతో స్టేడియం కిక్కిరిసిపోయింది. సుమారు 4 గంటలపాటు స్టేడియం పరిసరాలు సీబీఎన్ నినాదాలతో మారుమోగాయి. మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్ రాక్‌బ్యాండ్ నిర్వహించిన పాటల ప్రదర్శన పత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, ఐటీ ఉద్యోగులు, సీనియర్ సిటీజన్స్, యువకులు.. సీబీఎన్ వెంట తాముంటామంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. తెలుగుదేశం వ్యవస్థాపకుడు, తెలుగువాడి ఆత్మగౌరవ పతాకను ప్రపంచ వ్యాప్తంగా రెపరెపలాడించిన ఎన్టీఆర్ కుటుంబసభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే.. వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణంరాజు, ప్రముఖ జర్నలిస్ట్ కందుల రమేశ్, టీడీపీ నేత మహాసేన రాజేశ్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ప్రతినిధులు ఫణిశ్రీ, చల సాని సుధీర్, కంకణంపాటి సుధాకర్, సుమన్, సుధీర్ దొడ్డ, బండి రాజా, చదలవాడ కిరణ్, పాతూరి సుమిత తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 1200మంది వాలంటీర్లు సేవలందించారు.

(మిగతా 2లో..)

# ప్రార్థనా సమావేశంలో పేలుడు

**ఇద్దరు మృతి - 40 మందికి గాయాలు**

**కేరళలోని కాలామస్సేరిలో ఘటన**

తిరువనంతపురం :కేరళలోని కొచ్చి నగరానికి సమీపంలో కాలామస్సేరిలో ఆదివారం జరిగిన పేలుడు ఘటనలో ఇద్దరు చనిపోయారు. మరో 40 మంది గాయపడ్డారు. కాలామస్సేరిలోని అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో 'జహోవా సాక్ష్యం' పేరిట ప్రత్యేక ప్రార్థనా కూటమి నిర్వహించారు. ఈ ప్రార్థన స్థలంలోనే ఐఇడి పేలుడు చోటుచేసుకుంది. పేలుడు జరిపింది తానేనని త్రిస్సూర్‌కు చెందిన డొమినిక్ మార్టిన్ అనే వ్యక్తి పేర్కొన్నాడు. ఈ మేరకు అతను ఫేస్‌బుక్ వెబ్‌సైట్‌లో ఒక వీడియో పోస్టు చేశాడు. 'ప్రార్థనలు నిర్వహిస్తున్న సంస్థ ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. వారి సైద్ధాంతిక భావాలు దేశానికి వ్యతిరేకమైనవి. జాతీయగీతం పాడరాదని, సైనిక సర్వీసుల్లో చేరవద్దని ప్రజలను ఆ సంస్థ ప్రేరేపిస్తోంది' అని మార్టిన్ ఆరోపించాడు. ఆన్‌లైన్ ద్వారా బాంబు తయారం చేయడం నేర్చుకొని, టిఫిన్ బాక్స్‌లో బాంబులు ఉంచి రిమోట్ కంట్రోల్ ద్వారా పేల్చినట్లు సదరు నిందితుడు పేర్కొన్నాడు.



త్రిస్సూర్‌లోని కొడకర పోలీసు స్టేషన్‌లో మార్టిన్ లంగిపోయాడు. తాను కూడా క్రైస్తవుడినేని పేర్కొన్నాడు. అయితే అన్ని కోణాలను కేసును దర్యాప్తు చేస్తున్నామని శాంతిభద్రతల విభాగపు ఎడిజిపి ఎంఆర్ అజిత్ కుమార్ తెలిపారు. కాగా సిసిటివి దృశ్యాలు, మార్టిన్ మొబైల్ ఫోన్లలోని దృశ్యాలను పరిశీలించిన మీదట ఈ ఘాతుకానికి మార్టినే ఒడిగట్టి ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడి మొబైల్ ఫోన్లలోని గూగుల్ సెర్చ్ హిస్టరీ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. బాంబు తయారీ కోసం వాడిని సామగ్రిని మార్టిన్ నివాసంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. (మిగతా 2లో..)

# అగ్నిగుండంలా మండుతున్న గాజా

**ఇజ్రాయిల్ బాంబు దాడులతో విధ్వంసం**

**ఎటుచూసినా హృదయవిదారక దృశ్యాలే**

**గాజాతో స్థంభించిన కమ్యూనికేషన్స్**

**సహాయక సంస్థలు, దేశాల ఆందోళన**



లండన్/గాజా/జెరూసలేం : ఇజ్రాయిల్ అటు వైమానిక దాడులు, ఇటు భూతల దాడులను ముమ్మరంగా కొనసాగిస్తున్న నేపథ్యంలో గాజా స్ట్రిప్ మండుతున్న అగ్నిగోళంగా కనిపిస్తోందని, ఎటుచూసినా మంటలు, పొగ కమ్మేశాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. అల్ జజీరా తదితర అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం గాజాలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. అక్కడ సేవలందిస్తున్న సహాయక సిబ్బందితో తమకు కమ్యూనికేషన్స్ పూర్తిగా నిలిచిపోయాయని బయట నుంచి సహాయ శిబిరాలకు సామగ్రి చేరవేస్తున్న పాలస్తీనా రెడ్ క్రెసెంట్ సొసైటీ వంటి అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. ఇంటర్నెట్, ఫోన్ సర్వీసులు నిలిచిపోయాయి. గాజాలో వైమానిక దాడులను పెంచుతున్నామని ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగరీ తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో పదాదీ బలగాలను పెంచి భూతల దాడులను విస్తరింప జేస్తున్నామని వెల్లడించారు. గాజా సిటీలోని ప్రజలు దక్షిణం వైపు వెళ్లాల్సిందిగా హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా ఇజ్రాయిల్ దాడుల్లో దాదాపు 7500 మంది వరకు చనిపోయారు. వీరిలో 3000 మంది పైగా చిన్నారులే. కాగా ఈ నెల 7 నుంచి ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 110 మంది వైద్యులు మరణించినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. వేలాది మంది పౌరులు, వందలాది మంది వైద్య, ఇతర సహాయక సిబ్బంది గాయపడినట్లు పేర్కొంది.

లండన్‌లో నిరసనల వెల్లువ

గాజాలో కాల్పుల విరమణకు పిలుపివ్వడానికి బ్రిటన్ ప్రభుత్వం తిరస్కరించడంతో నిరసనగా బ్రిటీష్ విదేశాంగ కార్యాలయం ఎదురుగా వందలాది మంది ధర్నా చేశారు. కార్యాలయం ప్రవేశమార్గం అంతటా వందలాది బొమ్మలను పెట్టారు. అందులో ఒకో బొమ్మ దాడుల్లో మరణించిన ఒకో పాలస్తీనా చిన్నారిని గుర్తు చేస్తుందని వారు పేర్కొన్నారు. లండన్‌లో ప్రభుత్వ విభాగాల కార్యాలయాల గేట్లకు పిల్లలు టెడ్డీ బొమ్మలను వేలాడదీశారు. ఇజ్రాయిల్‌కు ఆయుధాల అమ్మకాలను ఆపాలని వారు బ్రిటన్ (మిగతా 2లో..)

## ఉల్లి ధరల పెరుగుదలపై కేంద్రంపై ధ్వజమెత్తిన ఖర్గే



న్యూఢిల్లీ : ఉల్లి ధరల పెరుగుదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రంపై విరుచుకుపడ్డారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించిన అనంతరం ఐదు రాష్ట్రాల ప్రజలు ఉల్లి ధరలు మరోసారి ఎందుకు పెరిగాయనే రహస్యాన్ని వెల్లడిస్తారని అన్నారు. సరఫరా తగ్గడంతో ఢిల్లీలోని రిటైల్ మార్కెట్‌లో ఉల్లి ధరలు రూ.65 - 80కి పెరిగాయి. మరోసారి ఉల్లి ధరలు ఎందుకు భారంగా మారాయి. ఈ ప్రశ్నకు సమాధానంగా ప్రజలు వచ్చే ఎన్నికల్లో బిజెపికి మంచి గుణపాఠం చెబుతారని అన్నారు. గత తొమ్మిదిన్నరేళ్ల బిజెపి ప్రభుత్వ హయాంలో ద్రవ్యోల్బణ భారంతో ప్రజల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రతిసారీ ద్రవ్యోల్బణం అంశంపై మోడీ ప్రభుత్వం జోకులు వేస్తోందని మండిపడ్డారు. " ద్రవ్యోల్బణం కనిపించడం లేదు. నేను ఉల్లిపాయలు తినను. ఇతర దేశాల కంటే భారత్‌లో మెరుగ్గా ఉంది " అని ప్రజలను హేళన చేస్తోందని దుయ్యబట్టారు.

## ఈజిప్టు అధ్యక్షుడితో ప్రధాని మోడీ చర్చలు



న్యూఢిల్లీ : ఇజ్రాయిల్‌-పాలస్తీనా యుద్ధంపై ప్రధాని మోడీ, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్ - సిసితో చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో క్షీణిస్తున్న భద్రతా పరిస్థితులు, మానవతా సంక్షోభంపై ఇరువురు నేతలు శనివారం ఫోన్ లో మాట్లాడారు. పెరుగుతున్న ఉగ్రవాదం, హింస, పౌరుల ప్రాణనష్టంపై ఇరువురు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతను వాతావరణాన్ని త్వరగా పునరుద్ధరించాలని, బాధితులకు మానవ సహాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని ఇరువురు నేతలు పిలుపునిచ్చారు. ఈ చర్చలపై ఆదివారం ఉదయం విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇరువురు నేతలు కొనసాగుతున్న యుద్ధంతో ఆ ప్రాంతం, మరియు ప్రపంచానికి ఎదురయ్యే చిక్కుల గురించి చర్చించినట్లు తెలిపింది. గాజాలో ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు ఈజిప్టు అధ్యక్ష కార్యాలయ అధికార ప్రతినిధి తెలిపారు. పరిస్థితులు మరింత దిగజారితే వచ్చే ముప్పుపైనా చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.

## రిపోర్టర్లలను బలోపేతం కోసం

# 'శ్రీ వీరేశలింగం పంతులు ప్రగతి బాట పథకం': ఆల్ తెలుగు ప్రజాపార్టీ

హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):బహుజన రాజ్యాధికారమే ఏకైక లక్ష్యంగా పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో వస్తున్న నూతన రాజకీయ పార్టీ "ఆల్ తెలుగు ప్రజాపార్టీ" తన మేనిఫెస్టోలో విలేకరుల శ్రేయస్సు కోసం, రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ఉన్న రిపోర్టర్ల బలోపేతం కావటానికి లిశ్రీ వీరేశలింగం పంతులు ప్రగతి బాట పథకాన్ని తమ మేనిఫెస్టో లో చేర్చినట్లు పార్స్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం రిపోర్ట ర్లలను బలోపేతం చేయడానికి మరియు లక్షాధికారులుగా చేయడానికి ఇచ్చే హామీ అని,ఈ పథకాన్ని మాస్టర్ కీ ఛానల్ సీఈఓ రాంబాబు నాయుడు ,అవుట్ పుట్ ఎడిటర్ వాసుదేవన్,ఇన్పుట్ ఎడిటర్ దుర్గాప్రసాద్,మాస్టర్ కి టీవీ ఛానల్ రూపొందించినట్లు ఆయన తెలిపారు.

ఈ పథకం ముఖ్య అంశాలు, లక్ష్యాలు...

1.రిపోర్టర్లుగా పనిచేసే ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ కార్డ్స్ ఇవ్వబడును. జర్నలిస్టుల హక్కులు., స్వేచ్ఛ కోసం మీడియా కమిషన్ తీసుకు వస్తాం. ఇందులో న్యాయమూర్తులు., పోలీస్ అధికారులు., మీడియా ప్రముఖులు ఉంటారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునే అధికారం కలిగి ఉంటుంది.

2.ఇళ్ల స్థలాలతోటి ఇల్లు ఇవ్వబడును.

రిటైర్డు జర్నలిస్టులకు నెలకు రు. 15,000 పెన్షన్ ఇవ్వనున్నాం. రిటైర్డు జర్నలిస్టులను ప్రతి ప్రభుత్వ సంస్థలోనూ., విభాగంలోనూ., చివరకు పంచాయితీ లో సైతం సలహాదారులుగా నియమించుకుంటాం.

3 స్మాల్ అండ్ మీడియం అని తేడా లేకుండా అన్ని పేపర్లకు , కేబుల్ ,శాటిలైట్ ,సోషల్ మీడియా నడిపించే వారికి కూడా ప్రభుత్వ ప్రకటనలుఇవ్వబడును

4.కోఆపరేటివ్ బ్యాంక్ ద్వారా రూ. 1000/-నుంచి 10 లక్షల రూపాయలు వరకు పావల వడ్డీతో రుణ




సదుపాయం.

5. ఉచిత నిర్బంధ విద్య కేజీ టు పీజీ .

6.ఉచిత వైద్య సదుపాయాలు మరియు మందులు కూడా సప్లై చేయబడును.

8. ఉద్యోగ కల్పన అన్ ఎంప్లాయ్మెంట్ హటావో పథకంలో బాగంగా ప్రతి విద్యార్థికి ఉద్యోగం వచ్చే వరకు అన్ని రంగాల్లో ఉచితంగా ట్రైనింగు ఇస్తూ వసతి , ఆహారం కూడా కల్పించబడును

9.అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్.

10. పోలీస్ వ్యవస్థ నుంచి రక్షణ గురించి ఉచిత న్యాయసహాయం అందించబడునని ఆయన తెలిపారు.

# ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దండి: జనచైతన్య వేదిక



గుంటూరు, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఈనెల 27వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు పరిశీలించి ఓట్ల అక్రమాలను నివారించి స్వచ్ఛమైన ఓటర్ల రూపకల్పనకు కృషి చేయాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2024 జనవరి 1 నాటికి 18ఏళ్ళు నిండిన ఎవరైనా ఓటుహక్కు కోసం డిసెంబరు 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ సదవకాశాన్ని యువత వినియోగించుకోవాలని కోరారు. ఈ ఏడాది 15.84 లక్షల ఓట్లను కొత్తగా చేర్చుకోవడం 13.48 లక్షల ఓట్లు తొలగించడం ద్వారా ఓటర్ల సంఖ్య అదనంగా 2.36 లక్షల మంది అదనంగా పెరిగినారని వివరించారు. ఫాము 7 అక్రమంగా దాఖలు చేయడం వలన లక్షలాది ఓట్లు కొల్పోయామని అనేక ఆరోపణలు వెల్లువెత్తిన సందర్భంగా పర్చూరు, ఉరవకొండ నియోజకవర్గాలలో ఉన్నత అధికారులను సస్పెండ్ చేశారని ఈ నేపథ్యంలో ఏ అధికారి కూడా అక్రమాలకు పాల్పడవద్దని హితవుపలికారు. డిసెంబరు 9 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారని ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. నవంబర్ 4,5 తేదీలలో మరియు డిసెంబరు 2,3 తేదీలలో బూత్ లెవల్ అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారని తెలిపారు. ఓటర్ల జాబితా స్వచ్ఛందంగా ఉంటే ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరిగి ఓటింగ్ శాతం గణనీయంగా పెరుతుందన్నారు. ఎన్నికల విధులలో వాలంటీర్లను, సచివాలయ సిబ్బందిని వినియోగించుకోకుండా అనుభవం ఉన్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను, గెజిటెడ్ ఆఫీసర్లను వినియోగించుకోవాలని జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుందన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగి పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్కా కాంతారావు**



గుంటూరు, ప్రజాపాలన ప్రతినిధి: 26.10.2023 న కావలి వద్ద కొందరు దుండగులుఆర్టీసీ డ్రైవర్ బి. రాంసింగ్పై దాడి చేయడాన్నిఏపీ పీటీడీ ఎస్సీ. ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్కా కాంతారావు ఖండించారుబెంగళూరు నుండి ప్రయాణికులు ను గమ్యం చేర్చాలనే లక్ష్యం తో ఒళ్ళంతా కళ్ళు చేసుకొని ఆర్టీసీ ప్రయాణం సురక్షితం అని చెప్పటమే కాకుండా చేసి చూపిస్తూ దేశం లోనే ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ కి మంచి పేరు వున్నది. అయితే బెంగళూరు నుండి ప్రయాణికులు ను విజయవాడ తీసుకొని వెళుతున్న ఆర్టీసీ ఉద్యోగిని కావలి లో కార్ డ్రైవర్ మరియు కొంతమంది దుండగులు బస్సు ను వెంబడించి బస్ డ్రైవర్ బి. రాంసింగ్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి అని ఏపీ పీటీడీ అధికారులు, పోలీస్ లు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ. ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులునక్కా కాంతారావు విలేకరుల సమావేశం లో డిమాండ్ చేసారుప్రభుత్వం లో విలీనం అయిన తరువాత ప్రభుత్వ ఉద్యోగులుగా, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ గా ఆర్టీసీ విలీనం చేసిన తరువాత ఉద్యోగులుగా మారినరాని, అయితే ఉద్యోగులు అంటే గతం లో గౌరవభావం ఉండేదాని నేడు ఉద్యోగసంఘానాయకులుఆధిపత్యం కోసం ఆరాటపడుతున్న విధానం సమాజం లో ఉద్యోగ వ్యవస్థని, ఉద్యోగ హక్కులను హరించేస్తున్నాయి అనడానికి కావలి లోడ్రైవర్ పై జరిగిన దాడి ఒక ఉదాహరణ అని అన్నారు సంఘాల నాయకులు హక్కుల పోరాటంలో ముందుండాలని, నేటికైనా కలసి హక్కులకోసం, ఆత్మ గౌరవం కోసం ఉద్యమాలను నిర్మించాలని సమాజం లో ఉద్యోగులు ప్రభుత్వం లో భాగమే నానే విషయం అటు ప్రభుత్వం ఇటు సంఘ నాయకులుమాటల ద్వారా కాకుండా క్రియల ద్వారా తెలియజేయాలన్నారు భవిష్యత్ లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదని ఆర్టీసీ యాజమాన్యం, పోలీస్ లు వెంటనే నిందుతుల పై హత్యయత్నం, ఐపీసీ సెక్షన్ 217/23%బ% / 143,341,332,307,323,427 ఐపీసీ సెక్షన్ల క్రింద వారిని వెంటనే అరెస్ట్ చేసి ఉద్యోగుల పట్ల ధవర్జన్యం చేసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండిగారిని పోలీస్ లను నక్కా కాంతారావు డిమాండ్ చేసారు

# అగ్నిగుండంలా మండుతున్న గాజా

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లండన్లో ఇజ్రాయిల్ రాయబారి నివాసం వెలుపల కూడా విడిగా నిరసన ప్రదర్శన జరిగింది. వారం వారం జరుగుతున్న నిరసన కార్యాచరణలో భాగంగా లండన్లో ఆదివారం వేలాదిమందితో ప్రదర్శన జరగనుంది.

ఆక్రమణలను ఆపే ఉద్దేశ్యం ఇజ్రాయిల్కు లేదు : నవీ పిళ్ళై

అక్రమంగా 56ఏళ్ళుగా కొనసాగుతున్న ఆక్రమణలను కొనసాగించేందుకే గాజాపై ఇజ్రాయిల్ పదే పదే దాడులకు దిగుతోందని, ఆ ఆక్రమణను అంతమొందించే ఉద్దేశ్యమేమీ ఇజ్రాయిల్కు లేదని ఐక్యరాజ్య సమితి విచారణా కమిషన్ ఛైర్పర్సన్ నవీ పిళ్ళై చెప్పారు. పాలస్తీనా ప్రాంత అక్రమ ఆక్రమణపై విచారణా కమిషన్ ఇంతకుముందే చర్చించింది. అక్టోబరు 7న దాడులు జరగడానికి ముందుగానే కమిషన్ నివేదికను విడుదల చేశారు.

# ఎస్సీలకు గాలం..

## ఎస్సీల కోసం గతంలో కొనుగోలు చేసి ఇచ్చిన స్థలం త్వరలో వారిపేర్లతో రిజిస్ట్రేషన్

### కసరత్తు ప్రారంభించిన కార్పొరేషన్ అధికారులు

### ఎన్నికల వేళ ప్రభుత్వం సరికొత్త ఎత్తుగడ



ఒంగోలు నగరం, అక్టోబరు 29 :ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎస్సీలను సంతృప్తిపరిచే చర్యలకు వైసీపీ ప్రభుత్వం ఉపక్రమించింది. నాలుగున్నరేళ్లుగా పథకాలన్నింటినీ అటకెక్కించి ఎస్సీ కార్పొరేషన్ను నిర్వీర్యం చేసి ఇప్పుడు వారి ఓట్ల కోసం సరికొత్త ఎత్తుగడ వేసింది. అందులో భాగంగా గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలు పథకం కింద ఇచ్చిన భూములపై లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు ఆ భూములు ఎస్సీ కార్పొరేషన్కు తనఖాలో ఉన్నాయి. వీటిని కేవలం సాగుచేసుకుని జీవించడమే గాని వాటిపై లబ్ధిదారులకు పూర్తి హక్కులు లేవు. త్వరలోనే వీటిని బదలాయించనుంది. అందుకు అవసరమైన కసరత్తును కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 1991వ సంవత్సరం నుంచి భూమి కొనుగోలు పథకం అమలు చేస్తోంది. దీని కింద ఇచ్చిన భూముల క్రయవిక్రయాలకు రైతులకు ఎలాంటి అధికారం లేదు. ఇన్నేళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎస్సీ రైతులకు ఇప్పుడు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వనుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్న 56 మండలాల్లో దాదాపు మూడు వేల మంది ఎస్సీ రైతులకు 2,600 ఎకరాల భూమిని కార్పొరేషన్ అధికారులు 1991వ సంవత్సరం నుంచి 2008 వరకు కొనుగోలు చేసి ఇచ్చారు. అప్పటి నుంచి ఎస్సీ రైతులు వీటిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇవి ప్రభుత్వానికి తనఖా చేసి ఉన్నాయి. భూమి కొనుగోలు పథకం కింద కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన రుణాన్ని తిరిగి చెల్లిస్తేనే తనఖా నుంచి విడిపించి పూర్తిగా ఎస్సీలకు ఈ భూములను బదలాయిస్తారు. అయితే రుణాలను ఎస్సీలు తిరిగి చెల్లించలేదు. దీంతో ఏళ్ల తరబడి ఈ భూములు ప్రభుత్వం వద్దే ఉన్నాయి. అయితే గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణాలను ప్రభుత్వం 12 ఏళ్ల క్రితం పూర్తిగా మాఫీ చేసింది. దీంతో ఈ భూములపై ఎస్సీలకు పూర్తిగా హక్కులు కల్పించే అవకాశం కలిగినప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వైసీపీ ప్రభుత్వం కూడా నాలుగున్నరేళ్లుగా దీని గురించి అసలు పట్టించుకోలేదు. దీంతోపాటు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో అమలు చేసిన పథకాలను కూడా అటకెక్కించింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో 1991 నుంచి 2008 వరకూ ఇచ్చిన భూములపై ఎస్సీలకు పూర్తి హక్కులు కల్పిస్తూ బదలాయించాలని నిర్ణయించింది.

తహసీల్దార్లకు లేఖలు

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి ఇచ్చిన భూముల వివరాలు పూర్తిగా కార్పొరేషన్ వద్ద లేవు. 2,600 ఎకరాలు ఉంటుందని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. అయితే జిల్లాలోని తహసీల్దార్ల ద్వారా పక్కాగా లెక్క తేల్చాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు తహసీల్దార్లందరికీ గతంలో లేఖలు రాశారు. కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి ఇచ్చిన భూముల వివరాలు పంపాలని కోరారు. అయితే తాహసీల్దార్లు అంతంత మాత్రంగానే స్పందించారు. కొంత మంది మాత్రమే వివరాలు పంపించారు. ఇప్పుడు మరోసారి వివిధ కోణాల్లో ఆ భూముల వివరాలను సేకరిస్తున్నారు.

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపు

ఎస్సీ రైతులకు కొనుగోలు చేసి ఇచ్చిన భూములను నిషేధిత జాబితా 22ఏ లో చేర్చాలని జిల్లాలోని అందరు తాహసీల్దార్లకు రెండేళ్ల క్రితమే కార్పొరేషన్ అధికారులు లేఖలు రాశారు. ఇలా చేర్చడం వలన అక్రమంగా జరుగుతున్న క్రయవిక్రయాలకు అడ్డుకట్టవేయాలని భావించారు. కానీ ఎక్కువ మంది తాహసీల్దార్లు ఈ లేఖలకు స్పందించ లేదు. ఈ భూములను నిసేధిత జాబితాలో చేర్చేందుకు ససేమిరా అన్నారు. దీంతో అనేక చోట్ల ఎస్సీలకు కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన ఇచ్చిన భూములు ఇతర చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇప్పుడు వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జేసీ ఆదేశాలు ఇచ్చారు. ఇతరుల చేతుల్లోకి వెళ్లిన భూములను వారి నుంచి విడిపించి లబ్ధిదారులకు అప్పగించనున్నారు. త్వరలో లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్లు

భూమి కొనుగోలు పథకం కింద 2008 వరకూ ఇచ్చిన భూములను తనఖా నుంచి విడిపించి లబ్ధిదారులకు కొత్తగా రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఈమేరకు రిజిస్ట్రేషన్ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరాయించనుంది. భూములను ఒక్కో లబ్ధిదారుడికి రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.1200 వరకూ ఖర్చు కానుంది. ఆ ప్రకారం ప్రభుత్వం మొత్తం రూ.25లక్షలను ఎస్సీ కార్పొరేషన్కు విడుదల చేసింది. ఈ మొత్తంతో కార్పొరేషన్ అధికారులు త్వరలోనే ఎస్సీలకు గతంలో కొనుగోలు చేసి ఇచ్చిన భూములను వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించి దస్తావేజులను అందజేయనున్నారు.

# పట్టాలపై మరో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఓహెచ్ఆర్ కేబుల్లో సమస్య తలెత్తడంతో... 6.30 గంటల సమయంలో అలమండ మిడిల్ లైన్లో ఆగిపోయింది. అరగంట వరకు రైలు అక్కడి నుంచి కదల్లేదు. మరోవైపు... విశాఖపట్నం నుంచి సాయంత్రం 6 గంటలకు రాయగడ ప్యాసింజర్ విశాఖ నుంచి బయలుదేరింది. కేబుల్ సమస్యతో అదే పట్టాలపై మరో రైలు ఆగి ఉందన్న సమాచారం వెనుక వస్తున్న రైళ్లకు అందాలి. అవన్నీ ఎక్కడికక్కడ ఆగిపోవాలి. లోపం ఎక్కడ జరిగిందో తెలియదు కానీ, విశాఖ-రాయగడ ప్యాసింజర్ రైలు అదే పట్టాలపైకి వచ్చేసింది. ఆగకుండా పరుగులు తీసింది. రాత్రి 7 గంటల సమయంలో పలాస ప్యాసింజర్ను వెనుక వైపు నుంచి బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో రాయగడప్యాసింజర్ గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పలాస ప్యాసింజర్ బోగీ, దాని ముందున్న మహిళల బోగీలు బాగా దెబ్బతిన్నాయి. పలాస పాసింజర్ ట్రైన్ మేనేజర్ (గార్డు)తో పాటు రాయగడ పాసింజర్ రైలు లోకో పైలట్ మృతిచెందగా, మరో లోకోపైలట్ తీవ్రంగా గాయపడినట్టు తెలిసింది. ఇక రాయగడప్యాసింజర్ ఇంజన్, దీని వెనుక ఉన్న బోగీ కూడా దెబ్బతిన్నాయి.

భీతావహ పరిస్థితి...

విశాఖకు రోజు కూలి పనులకు, ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం వెళ్లే వాళు విశాఖ-పలాస ప్యాసింజర్ రైలులో ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ప్రమాదం జరిగిన సమయంలోనూ రైలులో ప్రయాణికులు కిక్కిరిసి ఉన్నారు. అంతకుముందె కొత్తవలస స్టేషన్లోనే సుమారు 150 మంది వరకు ఎక్కారు. అనుకోని ప్రమాదంతో అక్కడ హాహాకారాలు మిన్నంటాయి. చీకటి వల్ల సహాయక చర్యలు చేపట్టడం కష్టంగా మారింది. తోటి ప్రయాణికులు, స్థానికుల సహకారంతో క్షతగాత్రులను అతికష్టంమీద బయటికి తీశారు. నలిగిన బోగీల మధ్య ఇరుక్కుపోయినవారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. విషయం వెంటనే విశాఖ నుంచి రైల్వే అధికారులు, ఆర్పీఎఫ్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి బయలుదేరారు. కట్టర్ల ద్వారా బోగీల భాగాలను విడదీస్తూ లోపల ఇరుక్కుపోయిన వారిని బయటికి తీయడం మొదలుపెట్టారు. క్షతగాత్రులను విజయనగరం కేంద్రాసుపత్రి, విశాఖపట్నం కేజీహెచ్లకు తరలించారు. 108 వాహనాలతోపాటు, సుమారు 15 ప్రైవేటు అంబులెన్స్లను వినియోగించారు. విజయనగరం జిల్లా కలెక్టరు నాగలక్ష్మి, పోలీసులు సహాయ చర్యలను పర్యవేక్షించారు.

# చంద్రబాబు అంటే ఓ బ్రాండ్

(మొదటి పేజీ తరువాయి)

వీడియో ప్రదర్శన..

చంద్రబాబు 25 ఏళ్లక్రితం ముందుచూపుతో ఏర్పా టు చేసిన సైబర్ టవర్స్ నేడు ఐటీరంగ అభివృద్ధికి ఐకాన్గా మారిందని.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ నిపుణులు అన్నారు. ఐటీ రంగం అభివృద్ధికి, తెలుగు రాష్ట్రాల్లో విద్యా వనరులు, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సీఎంగా చంద్రబాబు చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలు, ఆయన సాధించిన విజయాలను వీడియోల రూపంలో ప్రదర్శించారు.

ఎనభై దేశాల్లో..

చంద్రబాబు ప్రతిష్ఠను దిగజార్చాలనే ఉద్దేశంతోనే ఆయన్ను కారాగారంలో పెట్టారని.. అయినా ఆయన కీర్తి విశ్వవ్యాప్తమైందని వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణం రాజు అన్నారు. ప్రపంచంలోని 80 దేశాల్లో చంద్రబాబుకు మద్దతుగా అభిమానులు ప్రదర్శనలు చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్లో న్యాయానికి అన్యాయం జరిగిందని.. సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. '

# ప్రార్థనా సమావేశంలో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు తర్వాతే వివరాలు వెల్లడిస్తాం : సిఎం

బాంబు పేలుడు ఘటనను ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. సిపిఎం పొలిట్బ్యూరో సమావేశంలో పాల్గనేందుకు న్యూఢిల్లీలో ఉన్న విజయన్ పేలుడు ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, అది పూర్తి అయిన తర్వాతే తదుపరి వివరాలు వెల్లడిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. ఇది చాలా తీవ్రమైన విషయమని ఆయన పేర్కొన్నారు. ఘటనలో చనిపోయిన, గాయపడినవారి సంఖ్యను ఆయన నిర్ధారించారు. రాష్ట్రంలో శాంతియుత వాతావారణం పరిరక్షించేందుకు, సామరస్యతను పెంపొందించేందుకు వీలుగా ఈ నెల 30న అఖిల పక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం బాంబు పేలుడును తీవ్రంగా ఖండించింది. కేరళ ప్రజానీకం శాంతియుత జీవనాన్ని గడుపుతారని, శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేసింది. రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేందుకే ఈ దాడి జరిగినట్లుగా భావిస్తున్నామని పేర్కొంది.

# ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం: ప్రభుత్వ విప్ గ్రంధి

భీమవరం, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయం లో లబ్ధిదారులు బొల్లం శ్రీను, గుబ్బల భార్గవి, పెంటకోట రాంబాబులకు మూడు లక్షల 60 వేలు విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి



ప్రజల ఆరోగ్య భద్రతపై అనేక చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 3 వేల 500కు పైగా వ్యాధులకు ఉచితంగా కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం అందించే విధంగా పనిచేస్తున్నారని వెల్లడించారు. ఈ ఉచిత వైద్య సేవలు మన రాష్ట్రంలో ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రి లతో పాటు ఇతర రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆసుపత్రిలలో కూడా అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని కరోనా సమయములో కూడా కరోనా వ్యాధికి ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా వైద్య సేవలు అందించడం జరిగిందని అన్నారు. వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలోకి రాని వ్యాధులకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి నిధులు విడుదల చేసి వైద్యాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. ప్రజలు వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కలిగిన కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లినప్పుడు అక్కడున్న ఆరోగ్య మిత్రలను కలుసుకొని ఆరోగ్య శ్రీ పథకంలో ఏయే వ్యాధులకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయో తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు తోట భోగయ్య, కొనితివాడ గ్రామ ఉపసర్పంచ్ నాగరాజు శ్రీనివాసరాజు, కొట్టి కుటుంబరావు, బుంగా ప్రహ్లాదుడు, సమతం ఉమా తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పలకు బిక్ష అందించిన కొవ్వలి



నరసాపురం, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్, నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొవ్వలి యతి రాజ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు ఏర్పాటుచేసిన భిక్ష కార్యక్రమంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడు పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీక్ష చేపట్టిన స్వాములకు భిక్ష సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడుకు స్వామివారి శేష వస్త్రంతో చిరు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వలి ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మకాయల నీలిమ, సంకు భాస్కర నాయుడు, కోటిపల్లి బ్రహ్మానందం, కొవ్వలి రామ్మోహన్ నాయుడు అభిమానులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన అభివృద్ధికి 20 లక్షలు శాంక్షన్ చేయించిన హుడా చైర్మన్ గురు మోహన్ కి కృతజ్ఞతలు



బద్వేల్ : కడప జిల్లా బద్వేల్ పట్టణంలో అంబేద్కర్ భవన నిర్మాణమై దాదాపు 12 సంవత్సరాలు అయిందని మౌలిక వసతులు లేక నిరుపయోగంగా ఉన్న ఆ భవనానికి మౌలిక వసతులు కల్పించాలని ఆనాడు పూలే అంబేద్కర్ రాజ్యాధికారి సమితి అంబేద్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ప్రజాసంఘాలను కలుపుకొని అధికారులకు రాజకీయ నాయకులకు వినతి పత్రాలు సమర్పించి దాని వల్ల ఆ భవనానికి బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా గారి పన్ను నుండి 15 లక్షలు శాంక్షన్ చేయించడం గతంలో జరిగిందని దానివల్ల కొంతమేర అంబేద్కర్ భవన అభివృద్ధి జరిగిందని తరువాత ఆనాడు వాగ్దానం చేసిన హుడా చైర్మన్ గురు మోహన్ గారు నిన్న మీటింగ్లో 20 లక్షలు అంబేద్కర్ భవన అభివృద్ధికి శాంక్షన్ చేయించడం దళిత ప్రజాసంఘాలుగా సంతోషిస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ ముల్లపాటి పిచ్చయ్య దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యనిర్వహంగా కార్యదర్శి పరిగి వెంకటరమణలు పాల్గొన్నారు

## ఆగిపోయిన జగన్ అన్న కాలనీ నిర్మాణాలు



ప్రజాపాలన ప్రతినిధి పోరుమామిళ్ల :మండలంలోని టేకురుపేట జగనన్న కాలనీలో నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని నవరత్నాలలో భాగంగా జగనన్న కాలనీ ఏర్పాటు చేయాలని, ఇల్లు లేని ప్రతి పేదవాడికి జగనన్న కాలంలో ఇల్లు నిర్మించుకునేవీలు కల్పించిన ముఖ్యమంత్రి లక్ష్యం నెరవేరకుండానే పోయిందని పనులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న కాలనీ ఏర్పాటుచేసిన రెండు మోటర్లు ఒకటి పూర్తిగా పాడైపోయి రెండు నెలల నుంచిపనిచేయడం లేదని,మరొక మోటర్ పనిచేస్తున్న పైపులు లేని పూర్తిగా దెబ్బ తినడంతో నిర్మాణాలకు పూర్తి ఆటంకం ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కన కాలనీ కెళ్ళిపోవడం వల్ల కాలనీలో నివాసం ఉంటున్న వారు తాగడానికి అవసరాలకు నీరు లేక సమీపంలో ఉన్న ఎస్సీ కాలనీకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నట్లు ఆ విధంగా వ్యక్తం చేశారు. ఈ కాలనీలో 100కు పైగా నిర్మాణాలు చేపట్టవలసి ఉండగా కొన్ని మాత్రమే నిర్మించబడి కొన్ని పూర్తి అసంబతిగా అసంత అసంపూర్తిగా ఆగిపోయాయి. సింటెక్సు ఎక్కడ దూరంగా పారువేయబడి ఉన్నాయి. ముళ్ళ కంపలతో నిండిపోయి ఉంది. వసతులలో లేమితో కాలనీ నిర్మాణాలు ఆగిపోయినట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. సంబంధిత అధికారులు కలగజేసుకొని సమస్యలను పరిష్కరిస్తున్నట్లయితే కాలనీ నిర్మాణం పూర్తవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## జనసేన- తెదేపా సమావేశంలో పాల్గొన్న నాయకర్



నరసాపురం, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించిన శ్రీకాకుళం జిల్లా జనసేన –తెలుగుదేశం పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర పిఎసి సభ్యుడు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ ఛైర్మెన్, రాష్ట్ర జనసేన – టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు, నరసాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ జనసేన– తెలుగుదేశం పార్టీలు పొత్తు కుదుర్చుకున్న నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుల ఆదేశాల మేరకు ఇరు పార్టీలతో కూడిన జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని వైసీపీ ప్రభుత్వ అక్రమాలను ఎదుర్కొంటూ రానున్న ఎన్నికలలో విజయం సాధించి అధికారంలోకి వచ్చేందుకు ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేందుకు ఇరు పార్టీల నాయకులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నరసాపురం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు జాబ్ మేళా



నూజివీడు, అక్టోబర్ 29, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు 12 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించి 845 మందికి ఉపాధి కల్పించిన జరుగుతుందని ఏలూరు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ నిరుద్యోగ యువతీ యువకులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జాబ్ మేళా సంబంధించిన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పగడాల సత్యనారాయణ, సేలం రాము, శారదా కళాశాల డైరెక్టర్ శంకరరావు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ డి రామకృష్ణ పాల్గొన్నారు.

## అను ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో.. స్ట్రోక్ హెల్ప్ లైన్ ప్రారంభం




విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్ వారు ఓ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పక్షవాతంగా పిలువబడే బ్రెయిన్ స్ట్రోక్ బారినపడినవారికి తక్షణ వైద్య సేవలందించేందుకు గాను ప్రత్యేక హెల్ప్ లైన్ 9542108108 నెంబరుతో పాటు, స్ట్రోక్ కేర్ ఆన్ వీల్స్ పేరుతో పక్షవాత చికిత్సా వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ స్ట్రోక్ హెల్ప్ లైన్ సేవలను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది ఆదివారం ప్రారంభించారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గాజుల రమేష్ మాట్లాడుతూ, "స్ట్రోక్ అంటే మెదడుకు వచ్చే పోటు. దీనినే సాధారణ భాషలో పక్షవాతం అంటారు. అను ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్ట్రోక్ హెల్ప్ లైన్ 9542108108 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జి. రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్లు డాక్టర్ విశ్వేశ్వరరావు, డాక్టర్ దుర్గానాగరాజు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రవికుమార్, న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్, న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య మేదరమెట్ల, న్యూరో సర్జన్ డాక్టర్ సాయికృష్ణ, ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ జాఫర్ పాల్గొన్నారు.

## మరియ తల్లి జీవితం మానవాళికి ఆదర్శం



పోరుమామిళ్ల ప్రజాపాలన ప్రతినిధి : మరియతల్లి జీవితం ప్రపంచమానవాళికి ఆదర్శం అని పోరుమామిళ్ల డీన్ రెవ.ఫాదర్ జాలా విజయభాస్కర్ అన్నారు. టేకురుపేటలోని పునీత జోజప్ప గారి దేవాలయంలో జపమాల మాత మాస ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఏర్పాటు చేసినటువంటి దివ్య బలి పూజ లో పాల్గొని సందేశం అందించారు. ప్రేమ, దయ, స్వచ్ఛత, సేవ కలుషితం లేని మనసుకు ప్రతి రూపమే జపమాల మాత ఉన్నారు. ప్రతిరోజు జపమాల ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ఆనందము కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టేకురు పేట విచారణ గురువులు రెవ. ఫాదర్ అనిల్ వీరి ఆనందరావు టీచర్ బద్వేల్ విచారణ గురువులు విజయరావు దేవరాజు, గురువులు, కన్య స్త్రీ లు, విచారణ పెద్దలు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నపూర్ణ దేవికి మొక్కుబడి తీర్చుకున్న గ్రంధి



భీమవరం, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) : స్థానిక గునుపూడిలోని పంచారామ క్షేత్రంలో కొలువై ఉన్న అన్నపూర్ణమ్మ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ బియ్యం మొక్కుబడి చెల్లిస్తున్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమేశ్వర స్వామి ఆలయ పాలకవర్గం, ఆలయ అధికారులు, అన్నదాన కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. 2004 నుండి 2009 వరకు మొదటిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనకు ప్రభుత్వం ద్వారా వచ్చే పెన్షన్ సొమ్ముకు తోడుగా ఆయన సొంతంగా మరో లక్ష రూపాయలు వేసుకుని అన్నపూర్ణమ్మ దేవికి బియ్యం రూపంలో తన మొక్కుబడి చెల్లించేందుకు సిద్ధమయ్యారు. అయితే కరోనా సమయంలో సోమేశ్వర స్వామి ఆలయంలో నిత్యం జరిగే అన్నదానం కార్యక్రమం నిలిపివేసిన నేపథ్యంలో వచ్చేనెల 13వ తేదీ నుండి ప్రారంభం కానున్న కార్తీమాసం సందర్భంగా కార్తీకమాసం నెల అంతా భక్తులకు నిత్య అన్నదానం చేయాలని దీనికి సంబంధించి ముందుగా 100 క్వింటాళ్ల బియ్యాన్ని అంద జేస్తున్నామని ఆయన వారికి తెలిపారు. అవసరమైతే ఎంత బియ్యాన్ని అయినా తాను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. స్వామివారి మహా నివేదనకు కూడా ఆయన బియ్యం అందజేయనున్నారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో డి. రామకృష్ణంరాజు, పాలకవర్గ సభ్యులు నాచు శ్రీవల్లి, చెల్లబోయిన సూర్యప్రకాష్, కూర్మదాసు సత్య శ్రీనివాస్, నల్లం రఘు, కోయ తాతాజీ, లక్కు త్రిమూర్తులు, లీలా ఈశ్వర్, దాడి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి జాతర ప్రారంభించిన కొవ్వలి



నరసాపురం, అక్టోబర్ 29 (ప్రజాపాలన ప్రతినిధి) :పట్టణంలోని 7వ వార్డు పాలంకివారి వీధిలో కొలువై ఉన్న పుంతల ముసలమ్మ అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా, వేడుకగా నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రభ ఉత్సవాన్ని కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్, తెదేపా సీనియర్ నాయకుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. ఉత్సవంలో బాగంగా ఏర్పాటు చేసిన ఆశాదుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు కోటిపల్లి శ్రీ రాంబాబు, చినమిల్లి త్రిమూర్తులు, గుగ్గిలపు బుజ్జిబాబులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ కొమ్ముల ధన్వంతరి నాయుడు, కౌన్సిలర్ కోటిపల్లి సురేష్ కుమార్, కొవ్వలి ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మకాయల నీలిమదేవి, మాజీ కౌన్సిలర్లు అరేటి వేణుగోపాల్, సందక సురేష్, సంకు భాస్కరనాయుడు, కోటిపల్లి కన్నబాబు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, నంద్యాల బాబు, మల్లాడి మూర్తి, పొన్నమండ మురళీకృష్ణ, భోగిరెడ్డి ముత్యం, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాలలో అలజడి సృష్టించాలని ఉద్దేశంతో టిడిపి వారు కృష్ణారెడ్డిని హత్య చేశారు

### నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా. నరసరావుపేట. అక్టోబర్ 29 (ప్రజా పాలన ప్రతినిధి.) గురజాల నియోజకవర్గం లోని గ్రామాలలో అలజడి సృష్టించాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఎర్రచని శ్రీనివాసరావు తమ అనుచరులతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడైన కృష్ణారెడ్డి దారుణంగా హత్య చేశారని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురజాల పట్టణంలోని జంగమహేశ్వరపురం గ్రామం నందు ఇటీవల హత్యకు గురైన కునిరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి. కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబాన్ని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆనంతరం మీడియా సమావేశంలో నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , ఎమ్మెల్సీ జంగ కృష్ణమూర్తి , ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి మాట్లాడుతూ కృష్ణారెడ్డి ని హత్య చేసిన అంతుకులను ఏ స్థాయి వారైనా వెంటనే అరెస్ట్ అరెస్టు చేయాలని అన్నారు. గ్రామాలలో ప్రశాంతత లేకుండా చేయాలనే ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్త మంజులకు ఘన సన్మానం



నూజివీడు, అక్టోబర్ 29, ప్రజాపాలన ప్రతినిధి: నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో అంగన్వాడీ సహాయకురాలి గా విధులు నిర్వహించిన గొల్లపల్లి మంజుల పదవీ విరమణ సందర్భంగా శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ షేక్ నురాని, ఏసిడిపిఓ డి నాగేశ్వరి మాట్లాడుతూ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారి బాల బాలికలను తీసుకురావడం, సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంతో పాటు వారి బాగోగులను చూస్తూ అందరికీ ఆత్మీయురాలిగా ఉన్న మంజుల పదవీ విరమణ ఎంతో బాధ కలిగిస్తుందన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరేనని, మంజుల తన ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ అవకాశం ఉన్నంత వరకు సేవ చేయాలని సూచించారు. అందరి హృదయాలలో స్థానం సాధించిన మంజుల జీవితం ధన్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు శివ కుమారి, సులోచన, రాజ్యలక్ష్మి, రాగమయి, గాయత్రీ, రమాదేవి, యూనియన్ ప్రతినిధులు రాజకుమారి, ఆదిలక్ష్మి, కార్యకర్తలు జై పద్మ, జి మాధవి, డి రాజామణి, ఎం మాధవి, శ్యామల, పద్మ, ధనలక్ష్మి, సహాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
సోమవారం 30,అక్టోబరు 2023

## సనాతన ధర్మంపై వ్యతిరేకత ఎందుకు?

సనాతన ధర్మం విషయమై రాజకీయపరమైన రభస జరుగుతోంది. ఈ ధర్మం పూర్వాపరాలు, ఆ రభసకు కారణాలు తెలుసుకోవాల్సిన అవసరమున్నది.సనాతనం అంటే ప్రాచీనమైనది, శాశ్వతమైనది అని చెప్పవచ్చు. ధర్మం అనగా మానవత్వాన్ని రక్షించేది. కనిపిస్తున్న, కనిపించని వాటినన్నింటినీ నడిపించే ప్రకృతి నియమావళే ధర్మం. ధర్మం అనే భావనకు భారతీయ మతాలైన హైందవం, బౌద్ధం, జైనం, సిక్కు సంప్రదాయంలో స్వల్ప భేదాలతో చాలా అర్థాలు ఉన్నాయి. ఇవి కాలానుగుణంగా చెప్పబడ్డాయి.చరాచర జగత్తు అస్తిత్వానికి కారణాలను సనాతన ధర్మం నిర్వచించింది. మానవులు తమ సత్సంకల్పాలను ఇతరులకు గానీ, ప్రకృతికి గానీ హాని కలిగించకుండా నెరవేర్చుకుని, ఇహలోకంలో కీర్తినీ, సుఖాన్ని పొందడానికి దోహదం చేసే నియమావళే సనాతన ధర్మమని స్థూలంగా చెప్పవచ్చు. ప్రపంచ మతాలు అన్నిటిలో హిందూ మతమే అతి పురాతనమైనది. ధర్మం అనేది హిందూ మతంలో ఒక నిర్వాహక సూత్రం. మానవుల ప్రకృతిని, నిర్జీవ పదార్థాలను, విశ్వంలో పరస్పర అనుసంధాన చర్యలను అది వివరిస్తుంది. హిందూ మతంలో రెండు ధర్మాలు ఉన్నాయి. మొదటిది సనాతన ధర్మం. ఇది మార్పు లేనిది, స్థిరమైనది. రెండవది యుగధర్మం. ఇది హిందూ సంప్రదాయంతో స్థాపించబడిన యుగానికి, ఏక కాలానికి చెల్లుతుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే యుగ ధర్మం అనేది కాలానుగుణంగా మారుతుంది.సనాతన ధర్మాన్ని హిందూ మత విశిష్టతగా అభివర్ణించుతారు. వివిధ అంశాల మీద విజ్ఞుల వివేచనను, సమాజాభివృద్ధికి వారు నిర్దేశించిన నియమాలను మనువుతో మొదలైన ఋషి పరంపర క్రోడీకరించింది. మానవ సమాజాలలో లిపి లేని కాలంలో ఈ నియమాలు నోటి మాట ద్వారా ఉపదేశించబడేవి. అందుచేత సనాతన ధర్మ కాలం ఎప్పటి నుంచి ప్రారంభమయిందో గుర్తించబడలేదు. ఈ అనూచాన ధర్మాన్ని లిఖితపూర్వకంగా పొందుపరిచినవారు వేదవ్యాసుడు, భృగు మహర్షి అని అంటారు. ఈ సనాతన ధర్మాన్నే మనుస్మృతి అని కూడా పిలుస్తారు. వేదాలు, ఉపనిషత్తులు సనాతన ధర్మానికి ప్రాతిపదికలు, ప్రామాణికాలు అని చెప్పవచ్చును.ప్రజాపతి (బ్రహ్మ), శతప (సరస్వతి) సంతానమే మనువు. అనంతి అనే ఆమెను మనువు భార్యగా బ్రహ్మ సృష్టించాడు. మానవ జాతి అంతా వీరి సంతానమేనని పురాణాలు చెబుతున్నాయి. మనుస్మృతి ప్రాచీనమైన హిందూ ధర్మశాస్త్రం. దీనినే మనుధర్మశాస్త్రం, మానవ ధర్మశాస్త్రం, మను చట్టాలు అని కూడా చెబుతారు. ఇప్పుడున్న మనుస్మృతి ఏడుగురు మనువుల కాలంలో మార్పులు చెందిందని అంటారు.బ్రహ్మ సృష్టికర్త. ఆయన నోటి నుంచి బ్రాహ్మణులు, భుజాల నుంచి క్షత్రియులు, తొడల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు పుట్టినట్టు ఋగ్వేదం చెప్పింది. వేదాలు చదివి ఆచరించడం, బోధించడం, సమర్పణలు ఇవ్వడం, తీసుకోవడం బ్రాహ్మణుల బాధ్యతబీ ప్రజాకర్షణ, సమర్పణలు, ఇంద్రియానుభవాలతో అనుబంధం తెంచుకోవడం క్షత్రియుల బాధ్యతబీ పశు సంరక్షణ, వర్తకం, వ్యవసాయం వైశ్యుల బాధ్యతబీ పై కులాల వారికి సహనంతో సేవ చేయడం శూద్రుల బాధ్యతగా మనుస్మృతి నిర్దేశించింది. నాలుగు వర్ణాలూ ఆదిలో పుట్టుకతో కాక కార్యనిర్వహణా ప్రతిభతో గుర్తింపబడ్డాయి. కాలక్రమేణా వర్ణాలు జన్మతహ వర్ణాలుగా/ కులాలుగా పరివర్తన చెందాయి. ఏ కులం వారు ఆ కులానికి నిర్దేశించిన పని చేయడం ఆచారంగానూ, నిబంధనగానూ మారింది. ప్రస్తుత యాంత్రీకరణ కాలంలో పూజారులు, సలహాదారులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, కవులు, రచయితలు, తత్త్వవేత్తలను బ్రాహ్మణ వర్ణంగా చెప్పుకోవచ్చును. అలాగే స్వలాభాకాంక్ష లేని పాలకులు, శాసనకర్తలు, న్యాయమూర్తులు, సైనికులు, రక్షకభటులను క్షత్రియులుగా గుర్తించవచ్చు. పెద్ద వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను వైశ్యులుగాబీ శ్రామికులు, చేతివృత్తులు, వ్యవసాయం, ఇంటి పనులు, పారిశుద్ధ్య కార్మికులను శూద్రులుగా పరిగణించవచ్చును.సనాతన ధర్మం ప్రకారం జీవాత్మ పూర్వ జన్మలలో సముపార్జించిన శక్తి, జ్ఞానాన్ని బట్టి ఏదో ఒక వర్ణంలో జన్మిస్తుంది. శూద్రులు వేదాలు చదివి ఆచరించడానికి అర్హులు కాదు కాబట్టి, ఎన్ని జన్మలైనా వారు సేవక వృత్తికే పరిమితం. సనాతన ధర్మంలో చెప్పిన నియమ నిబంధనలను మూడుభాగాలుగా విభజించవచ్చును. అవి: 1) మోక్ష సిద్ధికై ఆచరించేవిబీ 2) సర్వ మానవ సౌభ్రాతృత్వం వెల్లివిరయడానికి ప్రతీ మనిషి అనుసరించవలసిన ప్రవర్తనారీతులుబీ 3) సమాజాభివృద్ధికి నాలుగు వర్ణాల స్వతస్సిద్ధ బాధ్యతలు. వీటిలో మొదటి రెండూ పూర్తిగా వ్యక్తికే పరిమితమై ఇతరుల జీవనంపై అంత ప్రభావం చూపవు. మూడవది మానవ జీవన స్థాయిని శాసిస్తుంది.నాలుగు వర్ణాల బాధ్యతలు ప్రతిభను బట్టి నిర్ణయమయ్యేవి. కాలక్రమేణా ఈ బాధ్యతలు ప్రతిభను బట్టి కాకుండా వారసత్వంతో మొదలై వర్ణాలు, కులాలు గాను, ఉప కులాలు గాను పరిణమించి ఏ కులం వారు ఆ కులానికి నిర్దేశించిన పనులే చేయాలనే ఆచారం వచ్చింది. సామాజిక వ్యవస్థలలో మార్పులు, పారిశ్రామికీకరణ, పెరుగుతున్న జనాభాతో అనేక రకాల వృత్తులు, ఉద్యోగాలు ఉనికిలోకి వచ్చాయి. వీటిని ఉన్నత కులాలు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) కైవశం చేసుకుంటున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన శూద్ర కులాలు వాటితో పోటీ పడలేక అసంతృప్తికి లోనవుతున్నాయి. తమకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తున్నాయి. ప్రతిఘటిస్తున్నాయి. తత్ఫలితంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కులాల వారికి చదువులు, కొలువులు, చట్ట సభలలో నియమిత కేటాయింపులు జరిగాయి.గౌతమ బుద్ధుడు, శంకరాచార్యులు, రామానుజాచార్యులు మొదలైన మహానుభావులు కుల వ్యవస్థను ఖండించి, మానవ జాతిని ఏక త్రాటిమీదకు తెచ్చే ప్రయత్నం చేశారు. సనాతనధర్మం చెప్పే వర్ణ వ్యవస్థకు కాలం చెల్లింది. ఆ ధర్మంలోని ఆచార నియమాలను మోక్ష సాధనకు అనుసరిస్తే ఎవరూ కాదనరు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థను హిందూ మతం సనాతనధర్మం పేరుతో ప్రోత్సహించి కొందరిని తక్కువ చూపు చూసింది, ఇంకా చూస్తోంది. ఇది కొనసాగినంత కాలం ఆయా వర్గాల నుంచి తిరుగుబాటు రావడం సహజం. ఈ మతపరమైన ఆచారాలు, ఆచరణలకు రాజకీయం కూడా తోడైతే అగ్నికి ఆజ్యం పోసినట్టే! మతంలో వివాదాలు సృష్టించవద్దని మనుధర్మం ఘోషించింది. ఈ సత్యాన్ని అందరూ అర్థం చేసుకుని సనాతన ధర్మ వ్యవహారాలను మత పెద్దలకు వదిలిపెట్టాలి. శ్రామిక ధర్మం (అసమాన శ్రమ విభజనను సమాన శ్రమ విభజనగా మార్చే బాధ్యత)ను నిర్వహించడంపై రాజకీయ నాయకులు శ్రద్ధ చూపాలి. తరతరాలుగా వెనక్కి నెట్టబడిన కులాలకు చేయూతనిచ్చి సహానుభూతితో సమైక్యంగా ముందుకు నడిపించడంపైనే మన జాతి పురోగతి ఆధారపడి ఉన్నది. సనాతన ధర్మం పేరిట కలహాలు, వివాదాలు ఎవరికీ మేలు చేయకపోగా అందరికీ అపకారం చేస్తాయి.

# కేంద్రీకృత వ్యూహంతో బిజెపి త్రిముఖ దాడి



అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వీస్తున్న ఎదురు గాలిని తట్టుకోవడానికి బిజెపి అగ్ర నాయకత్వం, ప్రధాని మోడీ, హెూంమంత్రి అమిత్ షా వేస్తున్న ఎత్తులు పైఎత్తులు అభాసుపాలవుతున్నాయి. ఆర్భాటంగా ప్రకటించిన తతంగాలు చావ చుట్టుకోవలసి వస్తున్నది. ప్రతిపక్షాల నుంచే గాక రాజ్యాంగ నిపుణుల నుంచి, మీడియా నుంచి విమర్శలు రావడంతో అనివార్యంగా వెనక్కు తగ్గవలసి వస్తున్నది. జమిలి ఎన్నికల నినాదం ఆ ఎత్తుగడలకు పరాకాష్టగానే రూపు దిద్దుకుంది. డబుల్ ఇంజన్ హడావుడి కూడా అదే. కేంద్రంలోని మోడీనే రాష్ట్రాలలో ఊరేగించి ఒకేసారి రాష్ట్రాలనూ కైవశం చేసుకోవచ్చనే అప్రజాస్వామిక ఆలోచన దీని వెనక వుందని అందరికీ అర్థమైపోయింది. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పన్ను, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే రేషన్, ఒకే మతం... అన్న చందంగా చేసే రాజకీయమే దేశభక్తిగా చలామణి చేయడం ఎంతో కాలం చెల్లదని ఒప్పుకోవలసి వచ్చింది. జమిలి ఎన్నికలను రుద్దడం తేలిక కాదనీ పైగా ఈ సమయంలో వ్యతిరేకత కూడా తెచ్చిపెట్టవచ్చని గ్రహించిన తర్వాత ప్రస్తుతానికి కేంద్రం వెనక్కు తగ్గింది. అయితే మరోవైపున ఇందుకోసమే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన అధ్యయన కమిటీ నియమితమైంది. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండానే కేవలం మోడీ కనుసన్నలలో పూర్తయిన కొత్త పార్లమెంటు భవనంలో దీన్ని ఆమోదించడం ఆసక్తికరం. మోడీ విధేయత కారణంగా గతంలో రాష్ట్రపతి పదవి పొందిన కోవింద్‌నే మళ్లీ తెరపైకి తేవడం యాదృచ్ఛికం కాదు. వాస్తవానికి పదవీ విమరణ చేసిన ఒక రాష్ట్రపతికి అధికారిక బాధ్యత అప్పగించడం ఇదే ప్రథమం. కేంద్ర ప్రభుత్వ అధికారులను కమల ప్రచారకులుగా వాడుకోవడం కోసం ఉద్దేశించిన 'రథ్ ప్రభారీ' ప్రహసనం ఆ విధంగానే విమర్శల పాలైంది. కేంద్ర పథకాల ప్రచారమంటూ అధికారులను స్వంత పార్టీ సైన్యంగా మార్చేసుకుని ఆ ముసుగులోనే పార్టీ ప్రచారం చేయించుకోవడానికి పెట్టుకున్న 'రథ్ ప్రభారీ' పేరును చల్లగా మార్చుకోవలసి వచ్చింది. ఎన్నికల కమిషన్ నోటీసుతో ఎన్నికలు జరిగే అయిదు రాష్ట్రాలలోనూ ఈ కార్యక్రమం వుండబోదనే ప్రకటనా చేయవలసి వచ్చింది. అయితే ప్రధాని దీన్ని ప్రారంభించడం, దేశ వ్యాపితంగా ఈ ప్రచార ప్రహసనం యథా విధంగా కొనసాగుతుంది. అంటే మౌలికంగా మోడీ ఆలోచనా ధోరణిలో గానీ రాజ్యాంగ వ్యతిరేక రాజకీయాలలోగానీ మార్పు లేదని స్పష్టమవుతుంది.

**రాముడి ఆశీస్సులు ఆయనకేనా?**

అయిదు రాష్ట్రాల ఎన్నికలలో బలాబలాలను బట్టి, రాజకీయ వాతావరణాన్ని బట్టి చూస్తే బిజెపికి పెద్ద అనుకూలత లేదని చాలా చోట్ల ఓడిపోవచ్చునీ సర్వేలు చెబుతున్నాయి. మూడు హిందీ రాష్ట్రాలలో పాతవారిని కొనసాగించలేని, ప్రస్తుతమున్న వారిని కొనసాగించలేని స్థితిలో బిజెపి వుంది. ఈ సంకట స్థితిని అధిగమించడానికి రామభక్తి నుంచి రాజకీయ కుయుక్తుల వరకూ దేనికీ వెనకాడటం లేదు. అయోధ్య పరిణామాలు, సుప్రీంకోర్టు తీర్పు...తదితర అంశాలు మళ్లీ ముందుకొచ్చాయి. 2019 ఎన్నికలు ముగియగానే అయోధ్యలో భూమి పూజలో ప్రధాని మోడీ ప్రత్యక్షమయ్యారు. ఇప్పుడు కూడా అయోధ్య ట్రస్టు ప్రతినిధులు మోడీని కలిసి 2024 జనవరిలో విగ్రహ మహా ప్రతిష్టాపనకు హాజరు కావలసిందిగా ఆహ్వానం అందించారు. ఆయన దాన్ని మీడియాలో పెద్ద విషయంగానే ప్రచారంలో పెట్టారు. బిజెపి మిత్రపక్షంగా దీర్ఘకాలం కొనసాగడమే గాక అయోధ్య ఘటనలలోనూ ఆరోపణలకు గురైన మహారాష్ట్ర శివసేన ఉద్ధవ్ థాకరే వర్గం ఎం.పి సంజరు రౌత్ దీనిపై స్పందిస్తూ 'రాముడు బిజెపికి, మోడీకి మాత్రమే సంబంధించిన దేవుడు కాదు కదా...' అని ఆక్షేపించారు. అయోధ్య ఆలయం ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్‌కు ఇది చాలా కోపం తెప్పించింది. ప్రధాని గనక పిలిచామంటే అదోరకంగా వుండేది. మోడీకి రాముడి ఆశీస్సులున్నాయి గనకే దేశాధినేతగా అధికారం చలాయించగలుగుతున్నారని, మిగిలిన వాళ్లు వీధుల్లో తిరుగుతున్నారని ఫక్తు రాజకీయ వాదన చేశారు. మరో విధంగా చెప్పాలంటే రాముడి ఆశీస్సులు ఆయనకే వున్నాయని కితాబిచ్చారన్నమాట. అయోధ్యలో భూ మాఫియా పెరిగి కబ్జాలు, దౌర్జన్యాలు చేస్తున్నారనే వార్తలు వస్తుంటే, ఒక పూజారి కూడా వారి చేతుల్లో ఈ మధ్యనే హత్యకు గురైతే ఇంతవరకు అతీగతీ లేదు. ఈ సమయంలోనే వారణాసిలో జ్ఞానవాపి మసీదు, బృందావన్ లో కృష్ణమందిరం సమస్యలను కోర్టుల్లో తిరిగి తీసుకురావడం కూడా ఈ మత రాజకీయంలో భాగమే. ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో రావణ దహనంలో పాల్గొంటూ మోడీ పరోక్షంగా ఎవరైతే కుల గణన పేరిట ప్రజల్లో చీలికలు తెస్తున్నారో వారిని కూడా ఇలాగే దహనం చేయాలని తీవ్రమైన మాటన్నారు. 'ఇండియా' వేదికను దృష్టిలో పెట్టుకునే ప్రధాని ఇంత మాటన్నారని మీడియా పోల్చి రాసింది.

**మార్క్సిస్టులపై దాడి, నచ్చిందే చరిత్ర!**

ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ సంప్రదాయికంగా చేసే దసరా ప్రసంగంలో ఇంచుమించు ఇదే సెలవిచ్చారు. సాంస్కృతిక మార్క్సిస్టులను, వోక్ పీపుల్ (మేల్కొల్పు జనాభా)ను తోసిపుచ్చాలని భగవత్ ఉవాచ. కొన్నేళ్ల కిందట మోడీ లోక్‌సభలో ఆందోళన జీవులంటూ అపహాస్యం చేయడం గుర్తుండే వుంటుంది. ఈ మాటలన్నీ కూడా చైతన్యం, కదలిక తీసుకొచ్చే వారిపైన ఎక్కుపెట్టబడిన ఆయుధాలే. పశ్చిమ దేశాల్లో విముక్తి కోసం పోరాడేవారిని వోక్ పీపుల్ అంటుంటారట. దేశంలో సమస్త అనర్థాలకూ వారే మూల కారణమని మోహన్ భగవత్ ప్రకటించారు. వీరు ప్రజల్లో అసంతృప్తి పెంచుతారట, చీలికలు తెస్తారట, ఆఖరుకు మణిపూర్‌లో కూడా వీరి వల్లనే కుకీ, మైతేయిల మధ్య తగాదా వచ్చిందట. ఈ దేశంలో వున్నవారంతా హిందువులేనని ప్రకటించిన సర్ సంఘ్‌చాలక్ నోట ఈ మాటలు రావడం దేనికి నిదర్శనం? సనాతన ధర్మమే శరణ్యమనే సంఘపరివార్ భావమే అది. అల్ప సంఖ్యాకులు, అణగారిన వర్గాలు, మహిళలు నోరు మూసుకుని పడుంటే ఏ గొడవలు రావని తాత్పర్యం. రాజ్యాంగం మొదటి అధికరణమే చెబుతున్నట్టు 'ఇండియా దటీజ్ భారత్'గా గాక ఈ దేశాన్ని భారత్ అనే పిలవాలని తీర్మానించడం కూడా ఈ మహా పథకంలో భాగం. ఇండియా పేరుతో పాటు దాని చరిత్రనూ మార్చడం దాని కార్యాచరణ రూపం. జరిగిన చరిత్రను మరింత శాస్త్రీయంగా ప్రామాణికంగా పరిశోధించి భావితరాలకు అందించడం గాక హిందూ రాజులను కీర్తించే విధంగా చరిత్ర పాఠాలుండాలని, మొఘల్ చరిత్ర తీసేయాలనీ ఎన్‌సిఇఆర్‌టి చెప్పడమూ అందుకే. అంతేనా? చరిత్రకూ పురాణాలకూ మధ్య తేడా చెరిపెయ్యాలి. చంద్రయాన్ పాఠంతో పాటు ప్రాచీన కాలంలోనే మనవాళ్లు ఆకాశ విహారం చేశారనీ పుష్పక విమానం వుండేదనీ చెప్పాలని ఎన్‌సిఇఆర్‌టి ఆదేశం. ఇదే సమయంలో నిజమైన చరిత్రలో అవసరమైన అంశాలు తెలియకుండా చేయడం కోసం గాంధీజీ హత్య, గుజరాత్ మత హత్యాకాండ వంటివి తీసేయాలి. ఇవి అమలులోకి రావడం తర్వాత జరిగినా ముందు ఈ వార్తలు విడుదల చేయడం ద్వారా మత ఛాందసాలను సంతృప్తి పరచాలి. అయితే విద్యారంగం ఉమ్మడి జాబితాలో వుంది గనక, పాఠ్యాంశాల పరంగా నిర్ణయాలు రాష్ట్రాలు తీసుకుంటాయి గనక కొత్త విధానం వాటిపై రుద్దడం జరుగుతున్నది. కేరళ, తమిళనాడు, బెంగాల్ వంటి రాష్ట్రాలు ఇందుకు గట్టిగా నిరాకరించినా ఎ.పి తో సహా పలు రాష్ట్రాలు అత్యుత్సాహంగా అమలు చేయడం ఆందోళన కలిగించే వాస్తవం. సహకార రంగం తమ అదుపులోకి తెచ్చుకోవడానికి అడుగులు వేస్తున్నారు. పర్యాటక రంగం కూడా తమ అధీనంలోకి తీసుకుంటున్నారు.

**రాష్ట్రాలపై ఆర్థిక బిగింపు**

ఈ ఏకపక్ష కేంద్రీకృత, రాజకీయ సాంస్కృతిక ఆధిపత్య ధోరణిని చలాయించడం కోసం మరింత వేగంగా ఆర్థిక కేంద్రీకరణ తీసుకొస్తున్నారు. పరిమిత అధికారాలు గల ఢిల్లీ రాష్ట్ర నమూనా ఇందుకు ఆదర్శంగా కనిపిస్తున్నది. సుప్రీంకోర్టులోనే ఇందుకు వ్యతిరేకంగా తీర్పు రాగా రాజ్యాంగ సవరణతో తోసిపుచ్చి సర్వాధికారాలు చేజిక్కించుకుంది కేంద్రం. ఉప ముఖ్యమంత్రితో సహా ఆ రాష్ట్ర నేతలను ఖైదు చేసి అడుగడుగునా ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డు తగులుతున్నది. జమ్మూ కాశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడంలో మతతత్వ రాజకీయమూ కేంద్ర పెత్తనమూ రెండూ వున్నాయి. అసలు స్వాతంత్ర్యానంతరం ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా చేయడం ఇదే ప్రథమం. రాష్ట్రాలకు ఆర్థిక సహాయం చేయకుండా పరాధీనతలోకి నెట్టడం, నిధులు కేటాయించకపోవడం నిరంతర ప్రహసనంగా మారింది. ఎ.పి, తెలంగాణల అనుభవమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. కేరళ నిరంతరం దీనిపై పోరాడుతూనే వుంది. నిధులు ఇవ్వకపోవడం, తెచ్చుకునే అప్పులపై ఆంక్షలు పెట్టడం రాష్ట్రాలను అడకత్తెరలోకి నెడుతున్నది. అప్పులు పెరిగాయని మళ్లీ ఆ బిజెపి నేతలే గగ్గోలు మొదలెడతారు. రాష్ట్రాల వాటా తేల్చే ఫైనాన్స్ కమిషన్ పరిధినే తగ్గించడంతో పాటు చేసిన సిఫార్సులనూ కేంద్రం తొక్కిపడుతుంది. జిఎస్‌టి కారణంగా పెట్రోలు, డీజిల్ తప్ప మరేవీ రాష్ట్రాలకు అందకుండా పోయాయి. మిగిలిన మేరకైనా రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా సెస్సులు, సర్ చార్జీలను పెంచి వాటికి వాటా లేకుండా చేస్తారు. రాష్ట్రాలపై శతృపూరితంగా దుష్ప్రచారం చేస్తారు. బీహార్‌లో ఎఐఐఎంఎస్ పెట్టడానికి రాష్ట్రాలు సరైన స్థలం చూపించలేదని తెలంగాణలో కిషన్‌రెడ్డి, బీహార్‌లో మన్సుఖ్ మాండవీయ ఒకే విధమైన ఆరోపణలు చేస్తారు. రైల్వేలకు కేరళ సహకరించలేదని మంత్రి అశ్వనీ వైష్ణవ్, కర్ణాటక తోడ్పడలేదని రాజీవ్ చంద్రశేఖర్ తిట్టిపోస్తారు. సంక్షేమ పథకాలను వక్రంగా చిత్రించడమే గాక సహాయ నిరాకరణ చేస్తారు. కర్ణాటక ప్రభుత్వం 'అన్న భాగ్య' పేరిట పథకం చేపట్టి ఎఫ్‌సిఐతో ఒప్పందం కుదర్చుకుంటే కేంద్రం ఒత్తిడి తెచ్చి రద్దు చేయిసుస్తుంది. పంజాబ్‌లో 'ఆప్' పథకాల పైనా కేంద్ర మంత్రులు దాడి చేస్తారు. రాష్ట్రాలకేగాక కేంద్రం అదుపు కూడా లేకుండా 'పి.ఎం కేర్స్' పేరిట భారీ నిధి వసూలు చేస్తారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి సహాయం చేసిన వారికి పన్ను, పి.ఎం కేర్స్ అయితే కార్పొరేట్ సామాజిక బాధ్యత అంటూ వివక్షత చూపిస్తారు.

చెదురుమదురుగా కనిపించే ఈ అంశాలన్నీ ఒక్కచోటికి చేర్చి చూస్తే మోడీ సర్కార్ కుటిల వ్యూహం ఏమిటో బోధపడుతుంది. కులం, మతం, జాతి దురభిమానం వంటివి రగిలించడం ఒకవైపు దేశ విశాలత్వాన్ని భిన్నత్వాన్ని చూపే రాష్ట్రాల వనరుల హక్కుల పైన దాడి మరోవైపు చేయడం ద్వారా వాటిని బలహీనపర్చాలి. తద్వారా రాష్ట్రాలలో తమను బలంగా సవాలు చేస్తున్న ప్రతిపక్షాలను దెబ్బ తీయాలి. ప్రధాని మోడీనే సర్వశక్తిమంతుడుగా, సకల నిర్ణయ సంధాతగా చూపించాలి. మిగిలిన నేతలనూ పార్టీలనూ ఆఖరుకు ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూడా డమ్మీలను చేయాలి. అయితే చైతన్యవంతులైన భారతీయులు, రాజ్యాంగం, న్యాయస్థానాలు... అన్నిటినీ మించి ప్రజా న్యాయస్థానం అందుకు అవకాశమివ్వడం కల్ల.

## ఆవిష్కృతమౌతోన్న సత్యం

ఒకరి జీవితాన్ని మరొకరు కొల్లగొడితే
ఒకరు ఇంకొకరిపై చెయ్యెత్తితే అది దాడి
దాడికి ప్రతిగా ఒక జాతి జాతినే
ధ్వంసించాలనుకుంటే అది యుద్ధం !
యుద్ధానికి యుద్ధమే
పరిష్కారమంటే అది కపట నీతి
వేల ఏండ్ల కిందట రూపు దిద్దుకున్న
రెండు జాతులు
పరస్పర హననానికి పాల్పడుతుంటే అది
అజ్ఞానం

సామ్రాజ్యవాద శక్తులంతా
ప్రపంచ పోలీసులంతా ఒక్కటై
యుద్ధాన్ని యెగదోస్తూ కొమ్ము కాస్తుంటే
అది ఆయుధ వ్యాపారం
పాలస్తీనాది ఉగ్రవాదమని ఇజ్రాయెల్‌ది
వీర శౌర్యమని
ప్రసార మాధ్యమాలు ఊదరగొడుతుంటే
అది దుష్ప్రచారం
భూమ్యాకాశ జల మార్గాల దిగ్బంధనంతో

యుద్ధ తుపాను సృష్టిస్తోన్న ఇజ్రాయెల్
చిగురుటాకులా వణుకుతూ
గిలగిల తన్లాడుతోన్న స్ట్రిప్ లాంటి గాజా
తెగిపడిన కంకాళాల మధ్య
విడిపడిన శరీర భాగాల మధ్య
రక్తమోడుతున్న మానవ బంధాల మధ్య
వధ్యశిలలుగా మారిన భవన శిధిలాల
మధ్య
కావాలిప్పుడు వసివాడిన
పసిపిల్లల భవిష్యత్తుకు జవాబు !
నీ వలెనే నీ పొరుగువారిని ప్రేమించమన్న

మనుష్యులంతా ఒకటే సంతానమన్న
ఎక్కడ ఆ దైవ కుమారుల అడుగు జాడలు
దైవమూ లేదు
దైవ కుమారులూ లేరన్న
పచ్చినిజం బయటపడుతోంది
ప్రవక్తలూ లేరు వారి
ప్రవచనాలుకు విలువా లేదన్న
వాస్తవం వెలుగులోకొస్తోంది
మనిషిని మనిషే రక్షించుకోవాలనే
మానవత్వ సాక్షాత్కారం అవసరమన్న
సత్యం ఆవిష్కృతమౌతోంది !

**– పి. మురళీ కుమార్**

## ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి: ఆర్‌టిసి యూనియన్ నాయకులు



గుడివాడ : ఆర్‌టిసి డ్రైవర్‌పై దాడి చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలంటు గుడివాడ డిపోలో కార్మికుల సంఘల నాయకులు నిరసన తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఎంప్లాయీస్, ఎన్ఎం, పలు కార్మిక సంఘాల నాయకులు కె.బాలాజీ, ఎన్.మదనమోహన్, కె.ఎస్, సుబ్రహ్మణ్యం, రంగయ్య, రమణ తదితరులు మాట్లాడుతూ కావలి పట్టణంలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వైసీపీ కార్యకర్తలను చట్టప్రకారం శిక్షించాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. అకారణంగా ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేయడం బాధాకరమన్నారు. కార్మికులపై మరోసారి ఇలాంటి దాడులు జరిగితే సహించేది లేదని హెచ్చారించారు. ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు, ఆర్టీసీ డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యార్మీ రోజున మైనార్టీ ముస్లింలకు విందు అందించడం అభినందనీయం: టిడిపి నాయకుడు వెనిగండ్ల



గుడివాడ : గ్యార్మి షరీఫ్(జెండా పండుగ) సందర్భంగా ఆదివారం స్థానిక 12వ వార్డు టిడిపి నాయకులు షేక్ ఇబ్రహీం, మహమ్మద్ నూరుద్దీన్, షేక్ నూరుద్దీన్‌లతో కలసి టిడిపి నాయకులు వెనిగండ్ల రాము ముస్లీలను అలిగనం చేసుకు న్నారు. అనతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొని మైనార్టీ నాయకులకు గార్మీ పండగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైనారిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్‌లో తిరుమలలో విశేష పర్వదినాలు..

తిరుమల, : నిత్యకళ్యాణం పచ్చతోరణంగా బాసిల్లుతున్న తిరుమల పుణ్యక్షేత్రంలో నవంబర్ నెలలో జరుగు విశేష పర్వదినాలు .. నవంబర్ 9 వ తేదిన మతత్రయ ఏకాదశి, 11 న మాస శివరాత్రి, 12 నదీపావళి ఆస్థానం, 13 న కేదారిగౌరీవ్రతం, 14 న తిరుమలనంబి శాత్తుమొర, 15 న భగనీహస్త భోజనం, 16 న మనవాళి మహాముని శాత్తుమొర, 17 న నాగుల చవితి, పెద్దశేషవాహనం, 18 న వార్షిక పుష్పయాగానికి అంకురార్పణం, 19 న శ్రీవారి పుష్పయాగం, అత్రి మహర్షి వర్ష తిరునక్షత్రం, స్కంద షష్టి, 22 న యాజ్ఞవల్క్య జయంతి, 23 న ప్రబోధన ఏకాదశి, 24 న, కైశిక ద్వాదశి ఆస్థానం, చక్రతీర్థముక్కోటి, 26 న కార్తీక పౌర్ణమి, 27 న తిరుమంగై ఆళ్వార్ శాత్తుమొర, 28 న తిరుప్పాణాళ్వార్ వర్ష తిరునక్షత్రం లాంటి పర్వదినాలను టిటిడి వైభవంగా నిర్వహించనుంది.

## కాబోయే ఎమ్మెల్యే కరణం వెంకటేష్ కలకాలం బాగుండాలి



చీరాల, అక్టోబర్ 29, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గానికి కాబోయే ఎమ్మెల్యే, వైసిపి చీరాల నియోజకవర్గ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు, కలకాలం బాగుండాలని, ఆయన త్వరగా కోలుకొని, ప్రజాసేవలో నిమగ్నం కావాలని, పోలేరమ్మ అమ్మవారిని కోరుకుంటూ, వైసీపీ యువనేత బక్కా శివప్రసాద్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీరాల మండలం కొత్తపాలెం గ్రామ పంచాయతీలోని, శ్రీ పోలేరమ్మ అమ్మ వారి దేవస్థానంలో, వైఎస్సార్ సిపి చీరాల నియోజకవర్గ ఇంఛార్జి కరణం వెంకటేష్ బాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై, చికిత్సపొందుతున్న ఇంచార్జి వెంకటేష్ త్వరగా కోలుకోవాలని,అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.తొలుత వైసిపిఇన్చార్జి వెంకటేష్ జన్మదిన వేడుకల్లో భాగంగా, కేక్ కట్ చేసి అందరికీ కేక్, స్వీట్లు పంచిపెట్టారు.వైసిపి యువ నేత బక్కా శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో, నిర్వహించిన ప్రత్యేక పూజలు, కేక్ కటింగ్ కార్యక్రమాలలో, నాయకులు దుడ్ల లోకనాథ్ రెడ్డి, గొల్లమురి మహేశ్వర రెడ్డి, జడా మోహన్ చంద్ర, బక్కా బాబు రెడ్డి, బక్కా నరసింహా రెడ్డి, పల్లపట్ల ఏడు కొండలురెడ్డి, బక్కా పరుశురాం రెడ్డి, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు, యూత్, పాల్గొన్నారు.

## గవర్నమెంట్ హాస్పిటల్‌కి వాటర్ మోటార్ సెట్ బహుకరణ



చీరాల, అక్టోబర్ 29, ప్రజాపాలన : చీరాల నియోజకవర్గంలో, ఎంతోమంది పేదలకు వైద్య సేవలు అందిస్తున్న చీరాల గవర్నమెంట్ హాస్పి టల్‌కి, వాటర్ మోటర్ సెట్‌ని, కరణం వెంకటేష్ జన్మదిన సందర్భంగా, అందించడం ఎంతో ఆనందంగా ఉందని, రోటరి క్లబ్ ఆఫ్ క్షీరపురి, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ లు పేద ప్రజలకు సేవ చేయడానికి, ఎప్పుడు ముందు ఉంటాయని, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడి వలస దేవరాజు అన్నారు. వైఎస్ఆర్సిపి చీరాల ఇంచార్జ్ కరణం వెంకటేష్ జన్మదినం సందర్భంగా, శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్, రోటరీ క్లబ్ క్షీరపురి లు సంయుక్తం గా, చీరాల గవర్నమెంట్ హాస్పిటల్‌కి, 20 వేల రూపాయల విలువ చేసే, వాటర్ మోటర్ సెట్ ని అందించారు.ఈ సందర్భంగా శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ,చీరాల శాసనసభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో, ప్రభుత్వం చీరాల గవర్నమెంట్ వైద్యశాలను ఎంతో అభివృద్ధి చేస్తుందని, చీరాల గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి లో, దాతలు ప్రతి ఒక్కరూ పాలు పంచుకొని, హాస్పిటల్ అభివృద్ధికి చేయూతను అందించాలని కోరారు. కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్ప టల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుహాసిని, రావి వెంకట రమణ, గవర్నమెంటు హాస్పటల్ సిబ్బంది సుందరమ్మ, విజయనిర్మల, పూర్ణ తదితరు లు పాల్గొన్నారు.

## హోమియోపతి పరిశోధన సంస్థచే స్వచ్ఛతా ఫ్రీడమ్ ర్యాలీ




గుడివాడ : ప్రాంతీయ హోమిపతి పరిశోధన సంస్థ అధ్వర్యంలో ఆదివారం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ అదేశాల మేరకు ఫీట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్ ఫర్ 4.0 కార్యక్రమాన్ని పరిశోధన సంస్థ అసిసెంట్ డైరెక్టర్, ఇన్‌చార్జి డా॥ బి.యస్.జె రాజకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమ సంస్థ అదేశాల మేరకు పట్టణంలోని నెహ్రూచౌక్ వరకు వాకథాన్ ర్యాలీలో పాల్గొనడం జరిగిందన్నారు. తోలుత డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమిపతి మెడికల్ కాలేజ్ విద్యార్థులు, సిబ్బంది స్థానిక పరిశోధన సంస్థ నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కిషన్‌బానోత్, రాజశేఖర్, సాంబమూర్తి, కాళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీనివాసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీలైనంత త్వరగా భారత సైన్యాన్ని వెనక్కు పంపుతాం.. మరోసారి మాల్దీవుల అధ్యక్షుడు సంచలన వ్యాఖ్యలు

తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోపే భారత సైన్యాన్ని తమ గడ్డ నుంచి వెనక్కు భారతదేశానికి పంపుతానని మాల్దీవుల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మహ్మద్ ముయిజ్జు ఇదివరకే సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఆయన ఆ అంశాన్ని ప్రస్తావించారు. భారత సైనిక సిబ్బందిని వీలైనంత త్వరగా తమ తీరం నుంచి వెనక్కి పంపేందుకు మాల్దీవులు కృషి చేస్తుందని తెలిపారు. దేశ విదేశాంగ విధానానికి ఇది అవసరమని.. మాల్దీవుల తీరం నుండి భారత సైన్యాన్ని వెనక్కు పంపడమే తన ఎన్నికల ప్రచారంలో ప్రధాన విధామని పేర్కొన్నారు. ఈ విషయంపై తాను భారతదేశంతో స్పష్టమైన, వివరణాత్మక దౌత్యపరమైన సంప్రదింపులు జరుపుతానని వెల్లడించారు.ఇక్కడ తన దృష్టి అసలు సైనిక సిబ్బంది సంఖ్యపై కాదని, మాల్దీవుల్లో భారతీయ సైనికులెవరూ ఉండకుండా చూసుకోవడమేనని మహ్మద్ ముయిజ్జు వివరణ ఇచ్చారు. ఈ విషయంపై భారత ప్రభుత్వంతో చర్చించి.. ఒక మార్గాన్ని కనుగొంటామన్నారు. మాల్దీవుల్లో మోహరించిన భారతీయ సైనిక సిబ్బందిని తొలగించే తన ప్రచార వాగ్దానానికి కట్టుబడి ఉంటానని ఆయన నొక్కి చెప్పారు. తమ గడ్డపై విదేశీ దళాలు అక్కర్లేదని మాల్దీవుల ప్రజలు తెలిపారని.. వారి అభీష్టం మేరకే భారత సైన్యాన్ని వెనక్కు పంపాలని నిర్ణయించానని తెలిపారు. ఇదే సమయంలో.. భారతీయ సైనికులు తిరిగి వెనక్కు వెళ్లాక, వారి స్థానంలో ఇతర దేశాల సైనికులు ఉండరని ఆయన స్పష్టం చేశారు. తాము అన్ని దేశాల నుండి సహాయ, సహకారం కోరుకుంటున్నాము.. పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక సంబంధాలను కోరుతున్నామని చెప్పుకొచ్చారు. కాగా.. మాల్దీవుల ప్రస్తుత అధ్యక్షుడు ఇబ్రహీం సోలిహ్‌పై మహ్మద్ ముయిజ్జు ఘనవిజయం సాధించారు. ఈయన మాల్దీవుల అధ్యక్షుడిగా నవంబర్ 17న బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయనను చైనా మద్దతుదారుగా విస్తృతంగా పరిగణిస్తారు. ఎన్నికల్లో ముయిజ్జు విజయం సాధించిన తర్వాత చైనా ఆయనకు శుభాకాంక్షలు తెలిపింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ మాట్లాడుతూ.. మాల్దీవుల ప్రజల ఎంపికను చైనా గౌరవిస్తుందని, కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుకు అభినందనలని తెలిపింది.

## షిండే శివసేన ఎంపీ హేమంత్ పాటిల్ రాజీనామా

ముంబై: మరాఠా కమ్యూనిటీకి రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌కు మద్దతుగా ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం ఎంపీ హేమంత్ పాటిల్ అదివారంనాడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తన రాజీనామా లేఖను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించనున్నట్టు చెప్పారు. మహారాష్ట్రకు చెందిన హింగోలి లోక్‌సభ నియోజకవర్గానికి హేమంత్ పాటిల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.మరాఠా కమ్యూనిటీకి విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌పై పోఫలి షుగర్ ఫ్యాక్టరీ ఏరియాలో నిరసన తెలుపుతున్న మారాఠా యాక్టివిస్ట్‌లను హేమంత్ పాటిల్ ఆదివారంనాడు వారిని కలుసుకున్నారు. వారి ఉద్యమానికి తన మద్దతు ప్రకటించారు. అక్కడికక్కడే లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను అడ్రెస్ చేస్తూ లేఖ రాశారు.

లేఖలో ఏం రాశారు?


మరాఠా రిజర్వేషన్ అంశం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉందని, రిజర్వేషన్ అంశంపై మరాఠా సమాజంలో భావోద్వేగాలు నెలకొన్నాయని హేమంత్ పాటిల్ తన లేఖలో తెలిపారు. తాను మరాఠా కమ్యూనిటీకి, రైతులకు అంకితమైన కార్యకర్తనని, రిజర్వేషన్ అంశంపై తన పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. కాగా, ఓబీసీ కేటగిరి కింద విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని మరాఠా కమ్యూనిటీ కొద్దికాలంగా నిరసనలు, ప్రదర్శనలు చేస్తోంది. కోటా యాక్టివిస్ట్ మనోజ్ జారంగే ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తూ, రెండో విడత నిరవధిక నిరాహార దీక్షను అక్టోబర్ 25న ప్రారంభించడంతో మరాఠా ఉద్యమ ఆందోళన ఊపందుకోనుంది.

## అంగరంగ వైభవంగా వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ జన్మదిన వేడుకలు

**దేవాలయాలు, మసీదులు, చర్చిలలో, ప్రత్యేక ప్రార్థనలు చేసిన వైసీపీ నేతలు**
**నియోజకవర్గ వ్యాప్తంగా ఇన్చార్జి వెంకటేష్ జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు**
**ఇన్చార్జి వెంకటేష్ త్వరగా కోలుకోవాలని నియోజకవర్గ వ్యాప్తంగా పూజలు, ప్రార్థనలు**



చీరాల, అక్టోబర్ 29, ప్రజాపాలన : వైయస్సార్సీపి చీరాల నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు జన్మదిన సందర్భంగా, నియోజక వర్గ వ్యాప్తంగా, వెంకటేష్ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై,చికిత్స పొందు తున్న ఇన్చార్జి వెంకటేష్ త్వరగా కోలుకొని, ప్రజా సేవలో పాల్గొనాలని కోరుకుంటూ, వైసిపి నేతలు చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో ప్రత్యే క ప్రార్థనలు, పూజలు చేశారు. నియోజక వర్గ వ్యాప్తంగా, ఆయా మండలాల పరిధిలోను, పంచాయతీలలోను, గ్రామాలలోనూ వైసిపి నాయ కులు, వెంకటేష్ జన్మదిన వేడుకలతో పాటు,వెంకటేష్ త్వరగా కోలుకోవాలని పూజలు,ప్రార్థనలు చేశారు. చీరాల గడియార స్తంభం సెంటర్లో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇంచార్జీ కరణం వెంకటేష్ జన్మదిన వేడుకలను, అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానకార్యక్రమాలు, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి వైష్ణవి, వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, టౌన్-1 పార్టీ అధ్యక్షులు కొండ్రు బాబ్జీ, టౌన్-2 గుంటూరు మాధవరావు, చీరాల మండలం అధ్యక్షులు ఆసాది అంకాళ రెడ్డి, వేటపాలెం మండలం అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, ఆర్ బి కె చైర్మన్లు కావూరి రమణా రెడ్డి, పల్లప్రోలు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, జిల్లాకార్యదర్శి బండారు శివపార్వతి, శిఖా సురేష్, జిల్లా వాణిజ్య విభాగఅధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, జిల్లా ట్రేడ్ యూని యన్ అధ్యక్షులు సల్లూరి అనిల్, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచ్లు, వివిధ హోదాల్లో ఉన్న ముఖ్య నాయకులు, చీరాల,వేటపాలెం మండల నాయకులు, కార్యకర్తలు, కరణం అభిమానులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.
















## అజీర్తి, గ్యాస్ సమస్యలను ఇలా చెక్‌పెడదాం..




ఈ మధ్య కాలంలో చాలా మంది అజీర్తి, గ్యాస్ సమస్యలతో బాధపడుతున్నారు. జంక్‌ఫుడ్స్, ఫాస్ట్‌ఫుడ్స్ లాంటి ఆహారపు అలవాట్లు వల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి ఆహార పదార్థాలు తరచూ తీసుకోవడం వల్ల జీర్ణాశయానికి సంబంధించిన గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం తదితర సమస్యలు వస్తున్నాయి. ఈ సమస్యల నుంచి త్వరగా బయటపడటానికి ఇంగ్లిష్ మందులు వాడుతున్నారు. ఈ మందులకు బదులుగా మనం ఇంట్లో సులువుగా కొన్ని చిట్కాలను ఉపయోగించి అజీర్తి ఇంకా గ్యాస్ ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

వాముతో చక్కని పరిష్కారం

ఆయుర్వేదంలో ఇలాంటి సమస్యలకు వాము చక్కని పరిష్కారంగా చెబుతున్నారు. అయితే ఈ వాముని ఏ విధంగా వాడితే జీర్ణాశయ ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కొవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. వాము వలన జీర్ణాశయానికి చాలా లాభాలు ఉన్నాయి. అజీర్తి, కడుపు ఉబ్బరం, గ్యాస్ మొదలైన సమస్యలను దూరం చేస్తుంది. జీర్ణక్రియలో ఇబ్బందులను తొలగించి జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. కడుపునొప్పిని తగ్గిస్తుంది. వామును నిమ్మరంతో కలిపి తీసుకుంటే హైడ్రోక్లోరిన్ యాసిడ్ పునరుద్ధరించబడి ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.

## సీజనల్ వ్యాధులను ఈ మందులతో అడ్డుకట్ట వేయొచ్చు!

వానాకాలంలో విజృంభించే బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల జలుబు, జ్వరం, మలేరియా, టైఫాయిడ్, బ్రాంకైటిస్ మొదలైన వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే చికున్ గున్యా, డెంగ్యూలతో అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించి, సత్వర వైద్యం తీసుకోవడం వల్ల పరిస్థితి విషమించకుండా ఉంటుంది. తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కీళు ,, కండరాల నొప్పులు, నీరసం, ఆకలి మందగించడం, వికారం, వాంతులు, శరీరం మీద దద్దుర్లు, చర్మం ఎర్రబడడం, అంతర్గత, బాహ్య రక్తస్రావం డెంగ్యూ ప్రధాన లక్షణాలు. పరిస్థితి తీవ్రమైతే రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయి. అవసరాన్ని బట్టి ఐవి ద్వారా ద్రవాలను అందిస్తూ, రక్తపోటును



పరీక్షిస్తూ ఉండాలి. కొన్ని సందర్భాల్లో ప్లేట్‌లెట్ల మార్పిడి కూడా అవసరం పడవచ్చు.


హోమియో పాత్ర ఇదే!

డెంగ్యూ అనేది ఆస్రత్రిలో రోగిని నిశితంగా పరిశీలించవలసిన వ్యాధి. సంప్రదాయ ఔషధాలతో పాటు హోమియో మందులను కూడా ఇవ్వడం ద్వారా రోగి కోలుకునే సమయం వేగాన్ని పెంచవచ్చు. హోమియో మందుల్లో భాగంగా యూపటోరియం పర్ఫ్‌ను 30 పొటెన్సీతో తీసుకోగలిగితే, ప్రోత్సాహక ఫలితాలు దక్కడంతో పాటు రోగి బాధలు తగ్గి, కోలుకునే వేగం పెరుగుతుంది. రోగి లక్షణాల ఆధారంగా ఇదే ఔషధాన్ని వేర్వేరు పొటెన్సీలలో వైద్యుల సూచనలను బట్టి వాడుకోవచ్చు. అలాగే ఎకొనైట్, బెల్లడొనా, బ్రయోనియా, జెల్సీమియం, ఇపెకాక్, క్రోతాలస్, ఫాస్ఫరస్, రస్టాక్స్ వంటివి సమర్థవంతంగా పని చేస్తాయి.

ముందస్తు జాగ్రత్తలు

పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లోని నీటి ట్యాంకులు శుభ్రం చేసుకోవాలి. కాచి వడబోసిన మంచి నీళ్లు తాగాలి. తాజా ఆహారం, సీజనల్ ఫ్రూట్స్ తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. సంపులు, నీటి ట్యాంకుల్లోకి దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు, శరీరానికి లేపనాలు వాడాలి. డెంగీకి కారణమైన ఈజిప్టీ దోమలు పగటివేళ కుడతాయి. కాబట్టి బడుల్లో తగిన జాగ్రత్తలు పాటించేలా యాజమాన్యాలకు సూచించాలి.

## ఆ వ్యాధులను కూడా ఆట కట్టించొచ్చు!



ఆస్తమా, హెచ్ఐవి లాంటి మొండి వ్యాధులకు హోమియోలో సమర్థమైన మందులున్నాయి. వ్యాధుల ఆట కట్టించి, ఆరోగ్యాన్ని అందించే సామర్థ్యం హోమియో వైద్యానికి ఉంది.

సైనసైటిస్, ఆస్తమాలు మళ్లీ బాధించవు

సైనసైటిస్, ఆస్తమా దీర్ఘకాలం వేధించే జబ్బులని చాలా మంది అనుకుంటారు. కానీ వీటిని హోమియో తో శాశ్వతంగా తగ్గించే వీలుంది. సైనస్‌లో ఉండే డిఫెన్స్ మెకానిజం చాలా వరకూ శరీరంలోకి చొరబడకుండా సూక్ష్మజీవులను అడ్డుకుంటుంది. కానీ ఐదు మైక్రాన్ల కంటే తక్కువగా ఉండే పార్టికల్స్ సైనస్‌లో ఆగకుండా నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరుకుంటాయి. తుమ్ముల ద్వారా శరీరం వీటిని బయటకు పంపించే ప్రయత్నం చేస్తుంది. పురుగుమందులు ఉపయోగించి పండించిన పదార్థాలు తినడం, వాతావరణ కాలుష్యం, ఇంటి పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, దుమ్ము, ధూళితో కూడిన ప్రదేశాల్లో ఎక్కువ సమయాలు గడపడం, వంటివి సైనస్‌కూ, ఆస్తమాకు దారి తీస్తాయి.

హెచ్ఐవి, హెర్పిస్ ఆటకట్టు

హెచ్ఐవి సోకితే మరణం తప్పదనే భావన ఇప్పటికీ చాలా మందిలో ఉంది. నిజానికి హోమియోలో హెచ్ఐవి వైరస్‌ను కట్టడి చేసే మందులున్నాయి. హెచ్ఐవి విస్తరించడానికి కారణం, దీని లక్షణాలు కొన్నేళ్ల తర్వాత ఆలస్యంగా బయటపడడమే! అప్పటివరకూ వారికి హెచ్ఐవి ఉన్న విషయం కూడా తెలియదు. రోగనిరోధకశక్తి తగ్గినప్పుడు వ్యాధి లక్షణాలు బయటపడతాయి. విరేచనాలు కావడం, బరువు తగ్గడం, ఇతరత్రా వ్యాధులు విజృంభించడం, వాతావరణ మార్పులను తట్టుకోలేకపోవడం, తేలికగా వ్యాధుల బారిన పడడం జరుగుతూ ఉంటుంది. హెర్పిస్‌లో.. పురుషాంగం మీద చమట పొక్కులు మాదిరిగా దురదతో కూడిన ఎర్రని నీటి పొక్కులు కనిపిస్తాయి. ఇవి పగిలి పుండ్లుగా మారతాయి. తగిన చికిత్స తీసుకోకుండా లైంగిక కలయిక ద్వారా ఈ పొక్కులు ఇతరులకు సోకే ప్రమాదం ఉంటుంది.

నడుం నొప్పి, మెడ నొప్పిని ఎన్నాళ్లు భరిస్తారు?

మెడ, వెన్నుపాములో మార్పులు రావడం వల్ల నాడుల మీద ఒత్తిడి పెరిగి ఈ సమస్య తలెత్తుతుంది. మెడ బిగుసుకుపోయినట్టు మారడం సమస్య ప్రధాన లక్షణం. మెదడు, వెన్నుపాము నుంచి శరీరంలోకి విస్తరించే ముఖ్యమైన నాడులు మెడ ఎముక గుండానే ప్రయాణిస్తాయి. ఏదైనా కారణం వల్ల మెడ నాడుల మీద ఒత్తిడి పెరిగినప్పుడు మెడ నొప్పి మొదలవుతుంది. నిర్లక్ష్యం చేస్తే కండరాలు, రక్తనాళాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. సర్వైకల్ స్పాండిలోసిస్ సమస్య పురుషుల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

## మైగ్రెయిన్‌తో బాధపడుతున్నా? ఆ చికిత్స కరెక్టేనా?

మైగ్రెయిన్ పరీక్షల్లో బయటపడే సమస్య కాదు కాబట్టి, లక్షణాలను బట్టి, తీవ్రతలను బట్టి ఆ నొప్పిని అదుపులో ఉంచే చికిత్సను ఎంచుకోవలసి ఉంటుంది. ఈ పార్శ్వపు నొప్పి ఎంత తరచుగా వేధిస్తోంది, ఎంత తీవ్రంగా ఉంటోంది... మొదలైన అంశాల ఆధారంగా చికిత్స చేయవలసి ఉంటుంది. కేవలం నొప్పిని తగ్గించడమే కాకుండా, తరచూ తిరగబెట్టకుండా చేసే మందులు హోమియోపతిలో ఉన్నాయి. కొంత మందిలో ఈ మందులు మైగ్రెయిన్‌ను శాశ్వతంగా అరికడతాయి. అలాగే ఈ చికిత్సలో భాగంగా మైగ్రెయిన్‌తో పాటు అనుబంధంగా ఇతర ఆరోగ్య సమస్యలకు కూడా కలిపి చికిత్స అందించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. అయితే ఈ మందులను వైద్యుల సలహా మేరకే వాడుకోవాలి. హోమియోలో మైగ్రెయిన్‌కు ఉపయోగపడే మందులు ఇవే!

బెలడోన: అకాసాత్తుగా తీవ్రమైన నొప్పి మొదలై, కళ్లు, ముఖం ఎర్రబడతాయి. వెలుతురు చూడలేరు.

బ్రయోనియా: ఏమాత్రం కదిలినా తలనొప్పి ఎక్కవవుతూ ఉంటుంది. వెలుతురు, శబ్దం భరించలేరు. అతి దాహం ఉంటుంది. తలను అదిమినట్టు పట్టుకుంటే ఉపశమనంగా ఉంటుంది.

జెల్సీమియం: తల బరువుగా ఉండడం, మెడ వెనక భాగం నుంచి నొప్పి మొదలవడం, తలలో పోట్లు, కళ్ల ముందు మెరుపులు కనిపించడం

శాంగ్వినేరియా: కుడి వైపు తల నొప్పి, మెనోపాజ్ దశకు చేరుకున్న స్త్రీలలో కనిపిస్తుంది.

స్పైజీలియా: ఎడం వైపు తల నొప్పి, గుండె దడ

ఐరిస్ వర్స్: తల కుడి భాగంలో నొప్పి, చెవి, కణతలు పగిలిపోతున్నంత బాధ, నొప్పి సూర్యోదయంతో మొదలై, సూర్యాస్తమయంతో ఉపశమనంపొందుతారు.

తూజా: ఎడమ కణతలో, తలలో నొప్పి, తలపై మేకులు గుచ్చినంత బాధ, వికారం

లాక్ కేన్: తల నొప్పి ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకు మారుతూ ఉంటుంది.

ఇగ్నీషియా: కోపం, దిగులు,



దుర్వార్తలు తెలియగానే మొదలయ్యే తలనొప్పి

కాక్యులస్: ప్రయాణంతో వచ్చే తలనొప్పి, వాంతులు

సిడ్రాన్, పల్సటిల్లా, కాలీ ఫాస్, డామియానా, ఇపెకాక్ మొదలైన మందులతో కూడా ఫలితం ఉంటుంది.

రోగ లక్షణాల ఆధారంగా, కుటుంబ చరిత్ర లేదా దృష్టిలో తేడాలను బట్టి మైగ్రెయిన్‌ను నిర్ధారించి, చికిత్స ఇవ్వవలసి ఉంటుంది. అలాగే సి.బి.పి, థైరాయిడ్, కిడ్నీ ఫంక్షన్, ఎలక్ట్రొలైట్స్ మొదలైన పరీక్షలు మైగ్రెయిన్ నిర్ధారణకు కొంత మేరకు తోడ్పడతాయి. మైగ్రెయిన్ సమస్యతో పాటు అనుబంధ సమస్యలకు కలిపి హోమియో మందులు వాడుకోవలసి ఉంటుంది. అయితే ఈ నొప్పి తీవ్రత, బాధించే సమయం ఎక్కువ కాబట్టి దాన్ని అదుపులో ఉంచడం కోసం మందు డోసును ఎక్కువసార్లు తీసుకోవలసి వస్తుంది. హోమియో మందులు మెదడు, శరీరాలు... రెండింటి మీదా ప్రభావం చూపిస్తాయి కాబట్టి మైగ్రెయిన్ నొప్పి త్వరగా తగ్గుతుంది. ఈ మందును నాలుక మీద ఉంచుకున్నప్పుడు, అక్కడి సున్నితమైన నరాల ద్వారా వేగంగా మెదడుకు చేరి, అక్కడి నరాల ఒత్తిడి తగ్గడం మూలంగా మైగ్రెయిన్ నొప్పి అదుపులోకొస్తుంది.

## మీ జట్టుకు రక్షణ ఈ పొడులే!



ఆయుర్వేదంలో జుట్టును సంరక్షించుకోవటానికి అనేక పద్ధతులు ఉన్నాయి. వీటిలో హెయిర్‌మాస్కలను తయారు చేసుకోవటం ఒక ప్రధానమైన అంశం. ఈ హెయిర్‌మాస్కను ఎలా తయారుచేసుకోవాలో చూద్దాం..

తయారీ విధానం

మన జుట్టును సంరక్షించే అనేక రకాల పౌడర్లు మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఒక గిన్నెలోకి తీసుకొని.. వాటిని నీటితో కానీ.. పెరుగుతో కానీ.. కొబ్బరినూనెతో కానీ కలపాలి. ఆ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి 30 నిమిషాలు వదిలేయాలి. ఆ తర్వాత షాంపుతో జుట్టును కడగాలి. ఇప్పుడు ఆ పౌడర్లు ఏమిటో చూద్దాం..

భృంగరాజ పొడి

భృంగరాజను మూలికల్లో రారాజుగా పిలుస్తారు. ఇది జుట్టును బలంగా చేస్తుంది. జుట్టు ఊడిపోకుండా కాపాడుతుంది. కొందరిలో జుట్టు తెల్లపడకుండా అడ్డుకుంటుంది.

ఉసిరి పొడి

ఉసిరి పొడిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది జుట్టు నిగనిగలాడేలా చేస్తుంది. జుట్టు బలంగా పెరగటానికి ఉపకరిస్తుంది.

వేప పొడి

కొందరికి మాడుపై బ్యాక్టీరియా చేసి రకరకాల సమస్యలు ఏర్పడుతూ ఉంటాయి. దురద పెడుతూ ఉంటుంది. ఈ సమస్యలకు వేప పొడి మంచి పరిష్కారమని చెప్పాలి.

మందార పొడి

మందారంలో విటమిన్స్, అమినో యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి జుట్టు ఊడిపోకుండా రక్షిస్తూ ఉంటాయి.

మెంతి పొడి

మెంది పొడిలో ప్రొటీన్, నికోటినిక్ యాసిడ్‌లు ఉంటాయి. ఇవి జుట్టు ఉడిపోకుండా రక్షణ కవచంలా పనిచేస్తాయి. మెంతి పొడిని పెరుగుతో కలిపి రాస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయి.

కుంకుడు పొడి

జుట్టులో ఉండే దుమ్మును తొలగించటంలో కుంకుడు పొడి ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. దీని వల్ల జుట్టులో సహజంగా ఉండే నూనెలకు ఎటువంటి ప్రమాదం ఉండదు. షికాకాయ్ పొడి కూడా జుట్టు ఆరోగ్యంగా పెరగటానికి ఉపకరిస్తుంది.

## ఈ చిట్కాలు పాటిస్తే ఉపశమనం పొందవచ్చు!



వేసవి వెతలకు ఆయుర్వేదంలో, హోమియో చికిత్సా విధానాలు కొన్ని చిట్కాలను సూచిస్తున్నాయి. అవేంటంటే...

ఆయుర్వేదం

పిత్త వేడికి సంబంధించినది కాబట్టి శరీర స్వభావం పిత్త అయినా, కాకపోయినా, వేసవిలో కొన్ని లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. పూర్వం లేని చిరాకు, విసుగు కనిపిస్తే మీలో పిత్త దోషం పెరుతున్నట్టు అర్థం. ఈ లక్షణాలు మానసికమైనవైతే, అలసట, జుట్టు పొడిబారడం, పొట్టలో పుండ్లు, ఛాతీలో మంట లాంటి శారీరక లక్షణాలూ కనిపిస్తాయి. ఇవన్నీ శరీరంలో వేడి పెరిగింది అనడానికి సూచనలు. దీనికి విరుగుడు శరీరాన్ని చల్లబరిచే ఆహారం తీసుకోవడమే! ఇందుకోసం....శీతలపానీయాలు కూడదు: చల్లదనం వేడికి విరుగుడు అనుకుంటాం. కానీ ఆహారం విషయంలో ఈ సూత్రం వర్తించదు. చల్లని శీతలపానీయాల వల్ల జీర్ణాగ్ని హెచ్చుమీరి అజీర్తి కలుగజేస్తుంది. కాబట్టి చల్లని నీరు, శీతలపానీయాలు తీసుకోకూడదు. బదులుగా గది ఉష్ణోగ్రతకు దగ్గరగా ఉన్న తాజా నీరు తాగాలి. చల్లదనాన్నిచ్చే ఫలాలు, కూరగాయలు: పుచ్చ, ద్రాక్ష, దోస లాంటి పళ్లు శరీరాన్ని చల్లబరుస్తాయి. అలాగే పాలు, వెన్న, నెయ్యి కూడా శరీర వేడిని తగ్గిస్తాయి. దోసకాయ, బ్రొకొలి, కాలీఫ్లవర్ మొదలైన కూరగాయలు కూడా శరీర వేడిని విరుస్తాయి. వీటితోపాటు నీరు ఎక్కువగా ఉండే బీరకాయలు, పొట్టకాయలు కూడా తింటూ ఉండాలి.

హోమియోపతి

ఎండ వేడిమి వల్ల తలనొప్పి, ఒళ్లు నొప్పులు తలెత్తుతాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే హోమియో చిట్కాలను అనుసరిస్తే ఎండదెబ్బకు గురవకుండా ఉంటాం! అవేంటంటే...బెల్లడోనా: వేడిమి కారణంగా ముఖం నుంచి వేడి ఆవిర్లు వెలువడినా, కనుగుడ్లు తేలిపోతూ, విపరీతమైన తలపోటు ఉన్నా, స్వేదం లేకున్నా ఉక్కపోతగా తోచినా బెల్లడోనా తీసుకోవాలి. బ్రయోనియా: ఎండలో ఉన్నంతసేపు ఎలాంటి తలనొప్పి లక్షణం కనిపించకపోయినా, సాయంత్రానికి లేదా మరునాటికి మొదలైతే బ్రయోనియా మందు తీసుకోవాలి. ఫెర్రమ్ ఫాస్: ఈ ఐరన్ సెల్ సాల్ట్, కణతల దగ్గర తలెత్తే నొప్పికి చక్కని విరుగుడు. పల్సటిల్లా: కత్తితో పొడిచినట్టు తల మొత్తం బాధిస్తున్నప్పుడు పల్సటిల్లా వాడాలి. క్యాంథారిస్: ఎండకు కమిలిన చర్మం కోసం ఒకటి లేదా రెండు మోతాదుల క్యాంథారిన్ వాడాలి. అర్టికా యురెన్స్: చమటపొక్కుల వల్ల కలిగే నొప్పి, మంటల నుంచి ఉపశమనం కోసం ఈ మందును ఆ ప్రదేశాల్లో వాడవచ్చు.

## గర్భిణీలు ఇలా చేస్తే సుఖ ప్రసవానికి..!

గర్భం దాల్చినంత మాత్రాన వ్యాయామాలు పూర్తిగా మానుకోవలసిన అవసరం లేదు. నిజానికి తేలికపాటి వ్యాయామాలు సుఖ ప్రసవానికి తోడ్పడతాయి. కటి కండరాలు, ఎముకలు బలపడి ప్రసవం తర్వాత కోలుకునే సమయాన్నీ తగ్గిస్తాయి. ఇందుకోసం ఈ వ్యాయామాలు శిక్షకుల సహాయంతో చేయాలి.

ఎయిర్ పంచ్

చేతులు, భుజాలు, ఛాతీ ప్రదేశాల్లోని కండరాలు బలపడడం కోసం చేసే వ్యాయామమిది. ప్రసవానంతరం రొమ్ముల తీరు కుదురుగా ఉండడం కోసం, ఆ ప్రదేశంలోని కండరాలు సాగిపోకుండా ఉండడం కోసం గర్భిణిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యాయామాల చేయాలి. ఈ వ్యాయామాలు సౌకర్యాన్ని బట్టి నిలబడి లేదా కూర్చుని చేయవచ్చు. 30 సెకండ్ల పాటు ఈ వ్యాయామాలు చేయాలి. నిటారుగా నిలబడి మోకాళ్లను వంచాలి. కుడి వైపు చేయి పిడికిలి బిగించి అటు వైపు తల తిప్పి చూస్తూ పిడికిలిని గాల్లోకి విసరాలి. ఇలాగే ఎడమ వైపు కూడా చేయాలి. గాల్లోకి పంచ్ విసిరేటప్పుడు శరీరం ఎక్కువ కుదుపుకు గురి కాకుండా చూసుకోవాలి. ఇలా రెండు వైపులా పాటించాలి.

ఆర్మ్ ఎక్స్‌టెన్షన్ షోల్డర్ ట్యాప్

ఈ వ్యాయామంతో ఉదరం, కటి, కాళ్లు, చేతులు... ఇలా శరీరంలోని కీలకమైన అవయవాలకు సంబంధించిన కండరాలన్నీ బలపడతాయి. గర్భంతో పొట్టలో కొవ్వు పేరుకుంటోందని భయపడే మహిళలకు ఈ వ్యాయామం ఓ ఊరట. ప్లాంక్‌ను పోలిన ఈ వ్యాయామంతో పొత్తికడుపు దగ్గర పేరుకున్న కొవ్వు కరిగిపోతుంది. నేల మీద బోర్లా పడుకుని, మెకాళ్ల మీద లేచి ప్లాంక్ భంగిమలో పాదాలు, అరచేతులు మాత్రమే నేలకు ఆనించాలి. ఈ భంగిమలో చేతులు, కాళ్ల మీదే శరీర భారమంతా మోపాలి. శరీర బరువును కుడి చేతి మీదకు తీసుకువచ్చి, ఎడమ చేత్తో కుడి భుజాన్ని తాకి, తిరిగి చేతిని నేల మీద ఆనించాలి. తర్వాత ఎడమ చేతి మీద శరీర భారం మోపి, కుడి చేత్తో ఎడమ భుజాన్ని తాకి, తిరిగి చేతిని నేల మీద ఆనించాలి.

ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.

ఆర్మ్ సర్కిల్స్

నడుము పై భాగానికి ఉద్దేశించిన వ్యాయామం ఇది. చేతులు, భుజాలు, ఛాతీ, మెడలోని కండరాలు ఈ వ్యాయామంతో బలపడతాయి. పెరుగుతున్న గర్భం కారంణంగా తలెత్తే మెడ నొప్పి, భుజాలు, వెన్ను నొప్పులు ఈ వ్యాయామంతో తగ్గుతాయి. నేల మీద కూర్చుని, లేదా నిలబడి ఈ వ్యాయామం చేయవచ్చు. చేతులు రెండు పక్కలకు చాపి కూర్చోవాలి. నిలబడి చేస్తున్నప్పుడు రెండు కాళ్లు మార్చి, మార్చి మడిచి, పైకి లేపి ఉంచాలి. అపసవ్య దిశలో చేతులు తిప్పుతున్నప్పుడు ఎడమకాలు, సవ్య దిశలో చేతులు తిప్పుతున్నప్పుడు కుడి కాలు లేపి ఉంచాలి.

## ఆడపిల్లల జీవితాలను మార్చిన గొప్ప నాయుడు చంద్రబాబు



హైదరాబాద్: తెలుగు జాతి ఉన్నంతవరకు మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మన గుండెల్లో ఉంటారని సామాజిక కార్యకర్త, ఐటీ ప్రొఫెషనల్ తేజస్వి పొడపాటి అన్నారు. ఆదివారం నాడు హైదరాబాద్ లోని హైటెక్ సిటీ సైబర్ టవర్స్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా తె చంద్రబాబుకు కృతజ్ఞతలు చెప్పేందుకు ఐటీ ఉద్యోగులు హైదరాబాదులో సీబీఎన్ గ్రాటిట్యూడ్ కాన్సెర్ట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తేజస్వి హాజరయ్యారు. ఈ సందర్భంగా తేజస్వి మాట్లాడుతూ.. "విశ్వనగరానికి చంద్రబాబు పునాది వేసి 25 ఏళ్లు అయ్యింది. ఈ గచ్చిబౌలి స్టేడియం నుంచి ఎందరో క్రీడాకారులు ఎదిగారు. ఆలోచనను ఆచరణలో పెట్టిన నాయకుడు చంద్రబాబు. రాళ్లలో మహానగరాన్ని సృష్టించిన నాయకుడు చంద్రబాబు. ఆడపిల్లల జీవితాలను మార్చిన గొప్ప నాయుడు చంద్రబాబు. కట్నం ఇచ్చే స్థాయి నుంచి ఎదురు కట్నం తీసుకునే స్థాయికి ఎదిగాం" అని తేజస్వీ తెలిపారు.

# స్టాంపు వెండర్‌లపై సిట్ నిఘా..

ఒంగోలు (క్రైం), అక్టోబరు 29 : ప్రకంపనలు సృష్టిస్తున్న నకిలీ దస్తావేజుల తయారీ కేసులో స్టాంపు వెండర్ల పాత్రపై సిట్ దృష్టి సారించింది. ఈ కేసులో సూత్రధారి అయిన పూర్ణచంద్రరావు ఇంట్లో 500కుపైగా ఖాళీ స్టాంపు పత్రాలను స్వాధీనం చేసుకుంది. వీటిని పూర్ణచంద్రరావు ముఠా ఎవరి వద్ద, ఎక్కడ కొనుగోలు చేసింది? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించింది. ఈమేరకు జిల్లా రిజిస్ట్రార్‌కు సిట్ అధికారులు లేఖ రాశారు. స్టాంపు వెండర్లు వారానికి ఒకరోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వారి వద్ద జరిగిన స్టాంపు క్రయవిక్రయాల వివరాలు తెలియజేయాలి. అయితే నకిలీ పత్రాల వ్యవహారం బయటపడిన రోజునుంచి ఓ మహిళా స్టాంపు వెండర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అమె రికార్డులు సంబంధిత సబ్ రిజిస్ట్రార్



కార్యాలయంలో నమోదు చేయించడం లేదు. అయితే పూర్ణచంద్రరావు వద్ద స్వాధీనం చేసుకున్న ఖాళీ స్టాంపులు సుమారు పది మంది స్టాంపు వెండర్ల వద్ద కొనుగోలు చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. వారి పేర్లతో ప్రత్యేకంగా ఫైళ్లు కూడా దొరికాయి. వీటిని వారే విక్రయించారా? వారి పేర్లతో నకిలీ పత్రాల ముఠా ప్రత్యేక ఫైళు తయారు చేసుకుందా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. స్టాంపులు ఎవరు విక్రయించారు అన్న విషయాన్ని గుర్తిస్తే స్టాంపు వెండర్ల పాత్ర ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ఈ ముఠా వద్ద సీజ్ చేసిన 123 డాక్యుమెంట్లలో నకిలీలను గుర్తించే పనిలో సిట్ నిమగ్నమైంది. ప్రతి డాక్యుమెంటులో అనుమానం ఉన్న అంశాలపై రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లేఖలు రాసి నకళ్లను పరిశీలిస్తోంది. ఇలా ఇప్పటికే 17 నకిలీ డాక్యుమెంట్లు ఉన్నట్లు లెక్క తేల్చింది. ఇంకా మిగిలిన డాక్యుమెంట్లను కూడా సునిశితంగా పరిశీలిస్తోంది.

బాధితుల గుర్తింపు

నకిలీ డాక్యుమెంట్లు తేల్చిన అనంతరం సంబంధిత ఆస్తులు ఎవరివి, నష్టపోయిన వారు ఎవరు అని సిట్ అధికారులు గుర్తిస్తున్నారు. బాధితులను పిలిపించుకొని ఫిర్యాదులు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకూ 23 కేసులు నమోదు చేశారు. ఇవి 100కు చేరే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు.

మరో విడత పోలీసు కస్టడీకి ఐదుగురు

నకిలీ పత్రాల తయారీలో కీలకంగా వ్యవహరించి రిమాండ్‌లో ఉన్న ఐదుగురిని మరోసారి పోలీసు కస్టడీకి తీసుకొన్నారు. గతంలో రెండు రోజులపాటు పూర్ణచంద్రరావు, యానాదిరావు, విష్ణువర్ధన్, రవీంద్రబాబులను పోలీసు కస్టడీకి తీసుకొని విచారించారు. అదేక్రమంలో తిరిగి శనివారం వారి నలుగురితోపాటు రావి శ్రీనివాసరావును కూడా కస్టడీలోకి తీసుకున్నారు. వీరిని రెండు రోజులపాటు విచారించనున్నారు.

అరెస్టుల పరంపర

నకిలీ పత్రాల తయారీ కేసులో ఇప్పటి వరకూ 12 మందిని అరెస్టు చేసిన సిట్ వేగం పెంచనుంది. అందుకోసం ఈ బృందంలో మరో నలుగురు సీఐలను చేర్చారు. గుంటూరు రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న నలుగురు సీఐలు శనివారం సిట్ అధికారుల వద్ద రిపోర్టు చేశారు. దీంతో అరెస్టుల పరంపర కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటికే నిందితుల జాబితా రోజురోజుకూ పెరిగిపోతోంది. అదేసమయంలో నకిలీ పత్రాల ముఠాలో సూత్రధారులైయిన ఐదుగురిని పోలీసు కస్టడీకి తీసుకోవడంతో సిట్ దూకుడు పెంచే అవకాశం కనిపిస్తోంది.

# రుషికొండ వైపు రావొద్దు!



విశాఖపట్నం : విశాఖలో సముద్ర తీరాన రుషికొండపై సీఎం క్యాంపు కార్యాలయం నిర్మిస్తున్న నేపథ్యంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లే బోట్లకు ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. రుషికొండ వైపు ఏదైనా బోటు వస్తే ట్రాకింగ్ ద్వారా దానిని గుర్తించి అడ్డుకోవచ్చునని అధికారుల ఆలోచనగా తెలుస్తోంది. బోట్లకు ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఇటీవల విశాఖలో జరిగిన నేవీ అపెక్స్ కమిటీలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొని దీని అమలుపై చర్చించారు. వాస్తవానికి ఇది కొత్త నిర్ణయం కాదు. ముంబైలో ఉగ్రవాదుల దాడి తరువాత సముద్రం వైపు నుంచి వచ్చి ఎటువంటి దాడులు చేయకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

2017లోనే పైలట్ ప్రాజెక్టుగా...

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2017లోనే పైలట్ ప్రాజెక్టు చేపట్టి విశాఖపట్నం, కాకినాడలో అమలుకు శ్రీకారం చుట్టింది. మెకనైజ్డ్ బోట్లకు జీపీఎస్ పరికరాలు ఇచ్చారు. వాటిని ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. జీపీఎస్ అమర్చిన బోట్లు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు ఎక్కడ తిరుగుతున్నాయో అధికారులు సమాచారం తెలుసుకోవచ్చు. తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల వరకు మాత్రమే వేటాడుకునే వెసులుబాటు ఉంది. ఆ హద్దు దాటితే అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్టు. కోస్టుగార్డు, నేవీ దళాలు చూస్తే పట్టుకొని శిక్షించే అవకాశం ఉంది. అందుకని ఆ పరికరాలకు 12 నాటికల్ మైళ్ల దూరం దాటితే అలారం మోగే ఏర్పాటు కూడా చేశారు. అయితే వీటిని పర్యవేక్షించాల్సిన రాష్ట్ర మత్స్య శాఖ జిల్లా కార్యాలయాలకు తగిన వసతులు కల్పించలేదు. సాంకేతిక ఏర్పాట్లు చేయలేదు. దాంతో ఏ బోటు ఎక్కడ తిరుగుతున్నదీ తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. అలా అది మూలకు చేరింది.

సీఎం సముద్ర తీరాన ఉంటారని..

నేవీ అపెక్స్ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్ని బోట్లకు జీపీఎస్ పెట్టాలని సూచించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే చాలా బోట్లు ప్రభుత్వం ఆదేశించకపోయినా, రాయితీ ఇవ్వకపోయినా జీపీఎస్ ఏర్పాటు చేసుకున్నాయి. సముద్రంలో ఏ దిక్కున ప్రయాణిస్తున్నారో తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. అధికార యంత్రాంగానికి వాటితో లింకు లేదు. అటువంటి ఏర్పాట్లు లేవు. భద్రతా వ్యవహారాల పరంగా నేవీకి అన్నిరకాల ఏర్పాట్లు ఉన్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి లేవు. విశాఖలో సీఎం క్యాంపు కార్యాలయం నిర్మిస్తున్న నేపథ్యంలో సముద్రంలో బోట్లు అన్నింటికీ ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇది మత్స్యకారుల ప్రయోజనం కోసమా? సీఎం భద్రత కోసమా? అని మత్స్యకార వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. భద్రత పేరుతో తమ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తే ఊరుకోబోమని, సముద్రంలో ఎక్కడైనా వేటాడుకునే హక్కు తమకు ఉందని, దానికి అడ్డంకులు సృష్టించవద్దని మత్స్యకారులు కోరుతున్నారు. తాము భద్రతా వ్యవహారాల్లో నేవీ, కోస్టుగార్డు, మెరైన్ పోలీసులకు ఎప్పుడూ సహకరిస్తూనే ఉంటామని, కొత్తగా ఆంక్షలు విధించవద్దంటున్నారు.

# గ్యాస్ సిలిండర్ కోసం కష్టాలు

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 29 : పీటీఎం మండలంలో వంటగ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు కష్టాలు పడుతున్నారు. అసలు సిలిం డర్ ఎప్పుడు వస్తుంది.. ధర ఎంత చెల్లించాలి అనే విషయమై గ్యాస్ ఏజెన్సీ నిర్వహణదారుల తీరుపట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. ఏజెన్సీ నిర్వాహకులు తమ ఇష్టా రాజ్యంగా ఏజెన్సీని నిర్వహిస్తుం డడంతో కష్టాలు అన్నీ ఇన్నీ కావంటూ వినియోగదారులు మండిపడు తున్నారు. ఇదేంటి బాబోయ్ గ్యాస్ సిలీండర్ కావాలంటే ఇన్ని ఇబ్బం దులు పడాలా.. ఎవ్వరిని అడగాలి, ఎవ్వరితో చెప్పుకోవాలి అంటూ వినియోగదారులు వాపోతున్నారు. మండలంలో ఇండెన గ్యాస్ ఏజెన్సీ మాత్రమే ఉండటంతో వారు ఎలా చేసినా, ఏమి చెప్పినా చెల్లుబాటు అవుతోంది. పైపెచ్చు ఎజెన్సీ నిర్వాహకురాలు రాజకీయంగా పరపతి కలిగి, అధికార పార్టీలో జిల్లా స్థాయి పదవిని సైతం పొంది ఉండడంతో అధికారులు సైతం వీరి మీద నిఘా పెట్టెందుకు గానీ, చర్యలు తీసు కునేందుకు గానీ సాహసించడం లేదు.

సిలిండర్ కావాలంటే వారం ఆగాల్సిందే..



మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇంట్లో సిలిండర్ అయిపోగానే ద్విచక్ర వాహనంలోనో, ఏ షేర్ ఆటోలోనో ఖాళీ సిలిండర్ ను పెట్టుకుని గ్యాస్ బుక్ తీసుకుని 20, 25 కిలోమీటర్లు ప్రయాణించి పీటీఎం గ్యాస్ గోడౌన వద్దకు వస్తే నో స్టాకు బోర్డు దర్శనం ఇస్తుంద న్నారు. ఆనలైనలో దరఖాస్తు చేసుకున్నప్పటికి కనీసం వారం రోజుల పాటు వేచి ఉండాల్సిన దుస్థితి పీటీఎంలో నెలకొంది.

వినియోగదారుల కష్టాలు వర్ణనాతీతం

మండలంలో వంట గ్యాస్ సిలిండర్‌లకు కృత్రిమ కొరత సృష్టించి సిలిం డర్ల విక్రయం ఆలస్యం చేస్తుండడంతో వినియోగదారులు అష్ట కష్టాలు పడుతున్నారు. మండలంలో 19,116 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో 12,214 దీపం కనెక్షన్లే. మిగతా వాటిలో 6406 జనరల్ కనెక్షన్లు, 87 అంగనవాడీ సెంటర్లకు 352 సీఎస్ ఆర్ కనెక్షన్లు ఉండగా 57 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. నామ్‌కే వాస్తే అన్నట్లు ఈ వాణిజ్య కనెక్షన్లు పొంది న వారు బ్లాక్‌లో పొందిన సిలిండర్లతోనే పని కానిచ్చేటట్లు ఏజెన్సీ నిర్వాహకులతో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకుని అనధికారికంగా సిలిండర్లను విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో సాధారణ వినియోగదారుడు సకాలంలో సిలిండర్ అందక ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు.

గ్రామాలకు సిలిండర్లు తెచ్చిందే సమయం... చెప్పిందే ధర

మండల కేంద్రానికి వచ్చి సిలిండర్ కొంటే రూ. 920 కు విక్రయించాల్సి ఉండగా రూ. 30య అధనంగా చెల్లించాల్సి వస్తోందని వినియోగదారు లు తెలిపారు. అయితే గ్యాస్ బండికి వేళాపాలా లేదు. సిలిండర్ కావా లంటే రోజంతా గ్రామాల్లోని రోడ్డలో కాపు కాయాల్సిందే.

# జిల్లా ఓటర్లు 19,15,682

విశాఖపట్నం, అక్టోబరు 29:జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం 19,15,682 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 9,51,011, మహిళలు 9,64,538, ట్రాన్స్‌జెండర్లు 133 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 13,527 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం అధికారులు విడుదల చేశారు. ఈ ఏడాది జనవరి నెలలో విడుదల జాబితాతో పోల్చితే భీమునిపట్నం, విశాఖ తూర్పు, దక్షిణ, పెందుర్తి, గాజువాక నియోజకవర్గాల్లో ఓటర్లు పెరగ్గా, విశాఖ పశ్చిమ, ఉత్తరం నియోజకవర్గాల్లో తగ్గారు. ఈ ఏడాది జనవరి ఐదో తేదీన విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాతో పోల్చితే 19,639 మంది పెరిగారు.ముసాయిదా ఓటర్ల జాబితాపై శుక్రవారం నుంచి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి డిసెంబరు 26వ తేదీకల్లా వాటిని పరిష్కరించి వచ్చే జనవరి ఐదో తేదీన తుది జాబితా విడుదల చేస్తారు. కాగా ఈ ఏడాది జనవరి ఐదో తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేసినప్పుడు జిల్లాలో 18,96,043 మంది ఓటర్లు ఉన్నారు. అప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తూ వచ్చారు. జూలై నుంచి ఆగస్టు వరకు ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించినప్పుడు కొత్తగా ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తొలగింపు కోసం ఫారం-6,7,8 దరఖాస్తులు సుమారు 1.5 లక్షల వరకూ వచ్చాయి. వాటిని పరిశీలించి మార్పులు, చేర్పులు చేశారు. వలస వెళ్లిన వారి పేర్లు తొలగించారు. మరికొన్నింటిపై విచారణ చేపట్టి వివరాలు అప్‌లోడ్ చేసినా గత నెల 26వ తేదీ నుంచి ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌ను హోల్డ్‌లో పెట్టడంతో వాటికి సంబంధించిన సమాచారం ముసాయిదా జాబితాలో పొందుపరచలేదు. గత నెల 26వ తేదీ వరకు ఉన్న వివరాలు మేరకు జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించారు. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో అత్యధికంగా భీమిలి నియోజకవర్గంలో 3,39,909 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తరువాత గాజువాక నియోజకవర్గంలో 3,12,809 మంది, పెందుర్తిలో 2,87,484 మంది, విశాఖ ఉత్తరం నియోజక వర్గంలో 2,71,737 మంది, తూర్పులో 2,65,273 మంది, పశ్చిమలో 2,21,340 మంది, దక్షిణంలో 2,17,130 మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో తుది జాబితా విడుదల చేసిన తరువాత మార్పులు, చేర్పులతో భీమిలిలో 12,293 మంది, పెందుర్తిలో 9,207 మంది, విశాఖ తూర్పులో 8,577 మంది, దక్షిణంలో 3,245, గాజువాకలో 2,271 మంది ఓటర్లు పెరిగారు. విశాఖ పశ్చిమలో 13,577 మంది, విశాఖ ఉత్తరంలో 2377 మంది ఓటర్లు తగ్గారు. గాజువాక తప్ప మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. గాజువాకలో మాత్రం మహిళల కంటే 2,778 మంది పురుష ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో ట్రాన్స్‌జెండర్లు 125 మంది ఉండగా కొత్తగా 29 మంది చేరగా 21 మందిని తొలగించడంతో చివరగా 133 మంది ఉన్నట్టు ముసాయిదా జాబితాలో పేర్కొన్నారు. కాగా జిల్లాలో గడచిన పది నెలల కాలంలో 1.04 శాతం మంది ఓటర్లు పెరిగారు. అత్యధికంగా భీమిలిలో 3.75 శాతం, తూర్పులో 3.34, పెందుర్తిలో 3.31, విశాఖ దక్షిణలో 1.52, గాజువాకలో 0.73 శాతం ఓటర్లు పెరిగితే విశాఖ పశ్చిమలో 5.78, ఉత్తరంలో 0.87శాతం తగ్గారు.



ఫారం-6 కింద 1,43,482 దరఖాస్తులు

ఓటరుగా చేరేందుకు (ఫారం-6) పురుషులు 69,800, మహిళలు 73,653 మంది, ట్రాన్స్‌జండర్లు 29 మంది...మొత్తం 1,43,482 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఓటు తొలగింపు కోసం (ఫారం-7) పురుషులు 66,874, మహిళలు 56,948, ట్రాన్స్‌జెండర్లు 21 మంది...మొత్తం 1,23,843 మంది దరఖాస్తు చేశారు.

ఓటు ఉందో లేదో చెక్ చేసుకోవచ్చు

ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు ఉందో...లేదో... 'సీఈవోఆంధ్ర.ఎన్ఐసీ.ఇన్' వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. వెబ్‌సైట్‌లో పీడీఎఫ్ ఎలక్టోరల్ రోల్స్‌లోకి వెళ్లి..డ్రాఫ్ట్ ఎస్ఎస్ఆర్ రోల్స్-2024పై క్లిక్ చేస్తే నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలు ఓపెన్ అవుతాయి. ఆ జాబితాలో పేరు లేకపోయినా, తప్పులు ఉన్నా, ఫొటో మారినా...మీ పరి?ధి లోని బూత్‌లెవెల్ అధికారి/ఏఈఆర్‌వో/ఈఆర్వోకు దరఖాస్తు చేసుకోవాలి. లేదా ఓటర్ హెల్ప్‌లైన్, వీవోటీఈఆర్.ఈసీఐ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

2023 ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్లు....

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ట్రాన్స్‌జండర్లు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| భీమునిపట్నం | 1,67,354 | 1,72,539 | 16 | 3,39,909 |
| విశాఖ తూర్పు | 1,30,503 | 1,34,747 | 23 | 2,65,273 |
| దక్షిణ | 1,07,403 | 1,09,688 | 39 | 2,17,130 |
| ఉత్తరం | 1,34,703 | 1,37,016 | 18 | 2,71,737 |
| పశ్చిమ | 1,10,015 | 1,11,307 | 18 | 2,21,340 |
| గాజువాక | 1,57,787 | 1,55,009 | 13 | 3,12,809 |
| పెందుర్తి | 1,43,246 | 1,44,236 | 2 | 2,87,484 |





# అనీల్ ని బాలయ్య ఓ ఆట ఆడుకున్నాడుగా!



యంగ్ డైరెక్టర్ అనీల్ రావిపూడి ఎనర్జీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఆయన సినిమాల్లాగే ఆయన కూడా బయట చాలా ఎనర్జిటిక్ గా కనిపిస్తారు. చలాకీగా ఉంటాడు. సెట్ లోనూ అంతే ఉత్సాహాన్ని చూపిస్తారు. నటీనటులతో సరదాగా ఉంటాడు. వాళ్లని ఆట పట్టించడంలోనూ ముందుంటాడు. పనితో పాటు ఎంటర్ టైన్ చేయడంలో అంతే ఉత్సాహం చూపిస్తాడు. అలాంటి ట్యాలెంటెడ్ కాబట్టే కాజల్ అగర్వాల్...శ్రీలీలతో ఆఫ్ ది సెట్స్ కూడా డాన్స్ చేయించాడు. ఆ వీడియో నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. మరి ఇలాంటి ఎనర్జిటిక్ పర్సన్ కి బాలయ్య లాంటి డబుల్ ఎనర్జీ ఉన్న నటుడు తోడైతే ఆ వెదర్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాలా సరిగ్గా అదే సన్నివేశం చోటు చేసుకుంది భగవంత్ కేసరి సెట్స్ లో. ఇటీవలే ఈ కాంబినేషన్ లో రిలీజ్ అయిన సినిమా బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆన్ సెట్స్ అనుభవాల్ని అనీల్ రివీల్ చేసాడు. చిన్ననాటి నుంచి బాలయ్య బాబు అంటే ఎంతో అభిమానం. ఆయనతో సినిమా చేయడం చాలా గర్వంగా అనిపించింది. ఆయన సెట్ లో జోకులు తెగ పెల్చేవారు. నా మీద బోలెడన్నీ సెటైర్లు వేసేవారు. ఆయన వచ్చారంటే నా పనైపోయేది. ఆయన నా మీద వేసే జోకులు..పంచ్ లు మామూలుగా ఉండేవి కాదు. అవన్నీ చాలా సరదాగా ఉండేవి. అలాగే ఓ దర్శకుడిగా నాకు అంతే గౌరవాన్ని ఇచ్చేవారు. ఆయన ఇచ్చిన గౌరవం అనేది ఎప్పటికీ మర్చిపోలేనిది. దర్శకుడిగా మరో మెట్టు ఎక్కడానికి ఆయనే ఆసరా అయ్యారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందర్నీ బాగా చూసుకుంటారు. తొలి వారికి డైలాగ్ డెలివరీ విషయంలో సహాయపడుతుంటారు. భగవంత్ కేసరిలో ఆయనతో పాటు ఎనిమిది నెలలు పాటు గడపడాన్ని ఎప్పటికీ మర్చిపోలేను అని అన్నారు. బాయల్య పంచ్ లు ...సెటైర్లు వేస్తే ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదు. అన్ స్టాపబుల్ వేదికగా ఆయన లో గొప్ప పంచ్ మాస్టర్ ఉన్నాడని అందరికీ తెలిసింది. షో సక్సెస్ అవ్వడానికి కారణం కూడా బాలయ్య అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# "జిగర్ తాండ డబుల్ ఎక్స్" రిలీజ్ డేట్ సస్పెన్స్ రివీల్.!

కోలీవుడ్ మల్టీ టాలెంటెడ్ నటుడు దర్శకుడు రాఘవ లారెన్స్ హీరోగా మరో వెర్సటైల్ నటుడు మరియు దర్శకుడు ఎస్ జె సూర్య లు నటించిన ఇంట్రెస్టింగ్ గ్యాంగ్ స్టర్ డ్రామా "జిగర్ తాండ డబుల్ ఎక్స్" కోసం కోలీవుడ్ ఆడియెన్స్ మంచి ఎగ్జైటింగ్ గా ఉన్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రాన్ని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించగా దీనికి మొదటి భాగం అయితే తెలుగులో గద్దలకొండ గణేష్ గా రీమేక్ చేశారు.అయితే ఈ సీక్వెల్ విషయంలో గత కొంత కాలం నుంచి రిలీజ్ డేట్ సస్పెన్స్ గా నిలవగా దీపావళి కానుకగా అయితే ఈ చిత్రం రిలీజ్ ని దీపావళి కానుకగా అని ఫిక్స్ చేసారు తప్ప రిలీజ్ డేట్ ని అయితే లాక్ చేయలేదు. కానీ ఇప్పుడు లారెన్స్ బర్త్ డే కానుకగా అయితే ఈ డేట్ ని అనౌన్స్ చేసేసారు. దీనితో అయితే ఈ చిత్రం ఈ నవంబర్ 10న రిలీజ్ చేయడానికి సిద్ధం చేసారు. మొత్తానికి అయితే ఈ సస్పెన్స్ పై ఫైనల్ గా ఓ క్లారిటీ వచ్చింది అని చెప్పాలి.




# హీరోయిన్‌తో లవ్.. అలా దొరికేసిన కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హిట్, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ కెరీర్‌లో ముందుకెళ్తున్నారు. ప్రేక్షకులను కంటిన్యూస్‌గా అలరిస్తున్నారు. అయితే ఈ హీరో.. ఓ హీరోయిన్‌తో ప్రేమలో మునిగిపోయారా అంటే.. నిజమే అని అర్థమవుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన... తన ప్రేమ గురించి పరోక్షంగా హింట్ ఇచ్చారు. ఇంతకీ ఆ హీరోయిన్ ఎవరనే వివరాల్లోకి వెళితే.. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం.. రాజావారు రాణిగారు చిత్రంతో టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్‌కు ఎంట్రీ ఇచ్చారు. ఇదే చిత్రంలో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది హీరోయిన్ రహస్య గోరఖ్. ఈ చిత్రం హీరోహీరోయిన్లుగా వీరిద్దరికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అయితే రాజావారు రాణిగారు షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య మొదలైన స్నేహం ఆ తర్వాత ప్రేమగా మారిందని బలంగా ప్రచారం సాగింది. సోషల్ మీడియాలో ఈ ఇద్దరిని ప్రేమ పక్షులు అంటూ ఎన్నో వార్తలు కూడా వచ్చాయి. కానీ వీరిద్దరు మాత్రం అస్సలు స్పందించలేదు. ఆ మధ్య కిరణ్ ఓ వెకేషన్ ట్రిప్‌కు వెళ్లి అక్కడ దిగిన ఫోటోలు షేర్ చేయగా.. మరోవైపు రహస్య కూడా అదే లొకేషన్‌లో దిగిన ఫోటోను షేర్ చేసింది. దీంతో వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నిజమేనని, ఇద్దరూ కలిసే షికారుకు వెళ్లారని అంతా అన్నారు. అనంతరం కిరణ్ గృహప్రవేశ వేడుకలోనూ ఈ ముద్దుగుమ్మ సందడి చేయడంతో ఆ పుకార్లు మరింత ఎక్కువయ్యాయి. అభిమానులు కూడా గట్టిగా ఫిక్స్ అయిపోయారు. అయితే తాజాగా మరోసారి దొరికిపోయారు కిరణ్ అబ్బవరం.పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ దావత్ అనే కొత్త షోను ప్రారంభించింది. ఈ షోకి కిరణ్ మొదటి గెస్టుగా వచ్చి సందడి చేశారు. అషురెడ్డి హోస్ట్‌గా వ్యవహరించింది. ఇద్దరు కలిసి పలు ఆసక్తికర విషయాలను మాట్లాడుకుని నవ్వించారు. అయితే అషురెడ్డి.. రహస్య గోరఖ్ – మీరు రిలేషన్‌లో ఉన్నారా అని అడిగేసింది. అలాంటిదేమీ లేదని, అలాంటిదేమైనా ఉంటే చెప్తామని బదులిచ్చాడు కిరణ్ అబ్బవరం. చెప్తాము అంటున్నారంటే ఇద్దరూ కలిసి ఒకేసారి పెళ్లి డేట్ ఎప్పుడో చెప్తారా అని మళ్లీ అషురెడ్డి నవ్వించింది. దీంతో కిరణ్ సిగ్గుపడిపోయాడు. నేను ఇచ్చిన ఏ ఇంటర్వ్యూలలో కూడా ఎప్పుడూ ఇంతలా దొరికిపోలేదు అని చెప్పుకొచ్చారు. దొరికిపోయాను అంటున్నారంటే నిజంగానే వీరిద్దరూ ప్రేమలో ఉన్నట్లేనని అంతా గట్టిగా ఫిక్స్ అయిపోయారు. దీనికి సంబంధించిన ఫుల్ ఇంటర్వ్యూ వీడియో త్వరలోనే రానుంది.



# స్టేషన్‌లో చియాన్ విక్రమ్ జులుం.. భయపడిన పోలీస్!




విభిన్న కథలు, పాత్రలతో ప్రేక్షకులను అలరించే తమిళ విలక్షణ హీరో చియాన్ విక్రమ్. ఆయన నటించే ప్రతి తమిళ సినిమా తెలుగులోనూ రిలీజ్ అవుతుంది. అయితే ఆయన ప్రస్తుతం ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం చేసేందుకు రెడీ అయ్యారు. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ గ్లింప్స్‌ను విడుదల చేసింది మూవీటీమ్. ఇది ఆద్యంతం ఇంట్రెస్టింగ్‌గా మాస్‌గా కనిపిస్తూ అలరిస్తోంది. వివరాల్లోకి వెళితే.. ఎలాంటి పాత్రనైనా కొత్తగా, ప్రేక్షకులను కట్టిపడేసేలా చేసే అద్భుతమైన నటుల్లో విక్రమ్ ఒకరు. పితామగన్, సామి, అపరిచితుడు లాంటి భారీ విజయాలను అందుకున్న ఆయనకు.. ప్రస్తుతం భారీ హిట్లు పడట్లేదు. అయినా ఆయన నుంచి పెద్ద సినిమాలే వస్తున్నాయి. త్వరలోనే ఆయన కబాలి దర్శకుడు పా.రంజిత్‌తో చేసిన తంగలాన్ చిత్రంతో వచ్చే ఏడాది జనవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. దీంతో పాటే విక్రమ్ కొత్త సినిమా అనౌన్స్‌మెంట్ కూడా వచ్చింది. విక్రమ్ 62వ సినిమాగా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు. రూరల్ డ్రామాగా ఇది రానున్నట్లు తెలుస్తోంది. ఓ పోలీస్ స్టేషన్లోకి ఒక మహిళ తనను ఇద్దరు రౌడీలు అల్లరి చేశారని కంప్లైంట్ చేయడానికి వస్తుంది. అప్పుడు స్టేషన్‌లో అధికారులు ఎవరి పనిలో వారు ఉంటారు. ఈ లోగా ఓ ఇద్దరూ దెబ్బలు తింటూ వచ్చి పోలీస్ స్టేషన్లోకి పడతారు. వాళ్లను హీరో చియాన్ విక్రమ్ కొట్టుకుంటూ తీసుకొస్తారు. దీంతో స్టేషన్‌లో గందరగోళ వాతావరణం క్రియేట్ అవుతుంది. జులుం చూపించిన హీరోను ఆపేందుకు పోలీసులు ప్రయత్నిస్తారు. అప్పుడు ఓ పోలీసుకు తన గురించి చెవిలో ఏదో చెబుతాడు హీరో. అప్పుడా పోలీస్ భయపడతాడు. మరీ ఇంతకీ హీరో ఏం చెప్పాడు అతడి నేపథ్యం ఏంటన్నదే ఈ కథలా తెలుస్తోంది. ఇకత చివర్లో జాతరలో ఒక మామూలు స్కూటర్ మీద మార్కెట్ వస్తువులు తీసుకెళ్తూ కనిపించాడు హీరో. మొత్తంగా టీజర్ రొటీన్‌కు భిన్నంగానే కనిపించింది. డిఫరెంట్ ఎంటర్టైనర్ చూడబోతున్న ఫీలింగ్ కలిగించింది.


# 'భగవంత్ కేసరి" లేటెస్ట్ వసూళ్లు ఇవే!




నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం లో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్టైనర్ భగవంత్ కేసరి చిత్రం థియేటర్ల లో రిలీజ్ అయ్యి ప్రేక్షకులను, అభిమానులని విశేషం గా ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబడుతోంది. ఈ చిత్రం 10 రోజుల్లో 123.92 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టడం జరిగింది. ఇది సెన్సేషన్ అని చెప్పాలి.వరల్డ్ వైడ్ గా భగవంత్ కేసరి కి వస్తున్న రెస్పాన్స్ పట్ల మేకర్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం లో శ్రీ లీల, అర్జున్ రాంపాల్ లు కీలక పాత్రల్లో నటించగా, మ్యూజికల్ సెన్సేషన్ థమన్ ఈ సినిమాకి సంగీతం అందించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై నిర్మించిన ఈ చిత్రం లాంగ్ రన్ లో మరింత వసూళ్లను రాబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# విశాఖలో అగ్రనిర్మాత మేనేజర్ గొడవేంటి

విశాఖపట్నం నగర నడిబొడ్డున ఉన్న సంగం – శరత్ థియేటర్లు నిరంతర రద్దీతో కళకళలాడుతుంటుంది. ఇప్పుడు సంగం– శరత్ పేరు రాంగ్ రీజన్స్ తో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. ఈ పాపులర్ థియేటర్ల మేనేజర్ కి, టాలీవుడ్ అగ్రనిర్మాత దిల్ రాజు విశాఖ ఆఫీస్ మేనేజర్ కి మధ్య గొడవ జరిగిందని ప్రముఖ మీడియాలో కథనం వెలువడింది. ఏ విషయంలో ఇద్దరికీ గొడవ అంటే.. దిల్ రాజు కంపెనీ మేనేజర్ ఛత్రపతి (ప్రభాస్) చిత్రాన్ని ప్రత్యేక ప్రదర్శన కోసం సంగం శరత్ మేనేజర్ ని థియేటర్ల కోసం అడిగారు. అయితే అభిమానుల తాకిడి గడబిడతో థియేటర్లకు నష్టం వాటిల్లుతుందనే ఆందోళనతో యజమానులు దానిని తిరస్కరించారు.



అయితే షో వేయడానికి ఛాన్సివ్వకపోతే సంక్రాంతి సినిమాలను మీ థియేటర్లలో ప్రదర్శించనివ్వను! అని దిల్ రాజు మేనేజర్ వ్యాఖ్యానించారని, ఇరు పార్టీల మధ్య మాటా మాటా పెరిగిందని చెబుతున్నారు ఈ గొడవలోనే ఎక్కడి నుంచో వచ్చి స్థానికులమైన మమ్మల్ని సవాల్ చేయడానికి మీరెవరు అంటూ దిల్ రాజు మేనేజర్ ని హెచ్చరించినట్లు సమాచారం. ఒంగోలుకు చెందిన వ్యక్తి వైజాగ్ దిల్ రాజు ఆఫీసులో పని చేస్తూ స్థానికంగా నివసిస్తున్నారని తెలిసింది. గొడవ అనంతరం థియేటర్ యజమానులు కొందరిని దిల్ రాజు మేనేజర్ వద్దకు పంపారని.. ఆ తర్వాత అతడిని అసభ్యపదజాలంతో దూషించారని.. ఫోన్‌లో వార్నింగ్ ఇచ్చారని చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మేనేజర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు అని కథనం వెలువడింది. ఒక ప్రైమ్ థియేటర్ యజమాని నన్ను చంపడానికి ప్లాన్ చేస్తున్నాడు! అని అతడు వాట్సాప్ స్టేటస్‌గా పోస్ట్ చేయడంతో రచ్చవుతోంది. ఈ గొడవలో దిల్ రాజు మేనేజర్ పై థియేటర్ యజమానులు కేసు పెట్టారని తెలిసింది. ఘటన అనంతరం దిల్ రాజు విశాఖపట్నం ఆఫీస్ మేనేజర్ ప్రముఖ మీడియాతో మాట్లాడుతూ... ఘటనను చిన్న సమస్యగా అభివర్ణించారు. తమ మధ్య కేవలం అపార్థం మాత్రమేనని.. ఇప్పుడు సరిదిద్దుకున్నామని ఆయన చెప్పినట్టు సమాచారం. అయితే కేసు విషయంలో రాజీ పడలేదని, ఫిర్యాదును ఉపసంహరించుకోలేదని శరత్ థియేటర్ మేనేజర్ ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు.



Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at United Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, S... ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.